thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

దీపావళి శుభాకాంక్షలు



చురకలు పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు దీపావళి శుభాకాంక్షలు. దీపావళి సందర్భంగా ఆదివారం చురకలు కార్యాలయానికి శెలవు. సోమవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 206 | జగిత్యాల ఆదివారం 08 నవంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

ధాన్యం నిల్వకు ఆధునిక సైలోలు



- తేమ పరీక్ష, శుభ్రపరచడం, ఆరబెట్టడం, నిల్వకు ఒకేచోట సదుపాయాలు
- పౌర సరఫరాల సంస్థ ద్వారా నేరుగా, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటుకు రెండు నమూనాలు
- సచివాలయంలో ప్రతిపాదనలను సమీక్షించిన మంత్రి ఉత్తమ్

వరి ధాన్యాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో ఆరబెట్టి నాణ్యతను కాపాడుతూ ఎక్కువ కాలం భద్రపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సైలోల వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. పంట కోత తర్వాత నిల్వ నష్టాలను తగ్గించడం, మార్కెట్‌లో ధర అనుకూలించే వరకు రైతులు ధాన్యాన్ని భద్రపరచుకునే వీలు కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.

2



ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలి

సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్

కాలుష్యానికి తావులేకుండా సురక్షితంగా వేడుకలు జరుపుకోవాలని పిలుపు

2



ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే..

రైతులూ అప్రమత్తం!

వరి సాగుకు దూరంగా ఉండండి.. ఆరుతడి పంటలకే ప్రాధాన్యమివ్వండి

ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున రాష్ట్రంలో కూడా వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకే సరిపోతాయని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున, రైతులు వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా కేవలం ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మి రైతులు నష్టపోవద్దని కోరారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని, అందరం కలిసికట్టుగా ఈ పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగ తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వరుసగా పర్యటిస్తానని ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు.

కొడంగల్, నవంబర్ 7 (చురకలు): తెలంగాణలో రాబోయే రోజుల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశముందని, ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీరు తాగునీటి అవసరాలకే సరిపోతుందని స్పష్టం చేశారు. రైతులు ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఎక్కువ నీరు అవసరమయ్యే వరి వంటి పంటలకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మి రైతులు నష్టపోవద్దని అన్నారు. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందరూ సమష్టిగా పరిస్థితులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. మూడు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో సీఎం మిగతా 2 లో




- ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు
- సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తా
- కాళేశ్వరం విధ్వంసానికి బీఆర్ఎస్ అవినీతే కారణం
- గడ్డం పెంచుకున్నంత మాత్రాన కేటీఆర్ తనలా మారలేడు
- కొడంగల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్

దోచుకున్నది చాలక మళ్లీ అధికారం కోసం కలలు

- సీఎం కుర్చీ కోసం ప్రతిపక్ష నేత ప్రమాణస్వీకార రిహార్సల్స్
- ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు నింపుదాం
- రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి

వివరాలు ఎ2లో..



డిండి నీటి సమస్యకు నదుల అనుసంధానమే పరిష్కారం

- ఏడుల నుంచి డిండికి నీళ్లు తేవడం అసాధ్యం
- బస్వాపూర్ మీదుగా గోదావరి జలాల తరలింపు
- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

3



సాగునీటి ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్ దోపిడీ

- కొడంగల్-నారాయణపేట-మక్తల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి
- మిగతా కంపెనీలన్నీ నామమాత్రమే
- 1,450 కోట్ల నుంచి రూ.6,825 కోట్లకు పెరిగిన ప్రాజెక్టు వ్యయం
- చుక్కనీరు అందకముందే ఐదు రెట్లకు చేరిన అంచనా వ్యయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3



బోస్టన్‌లో తెలంగాణ యువతి అదృశ్యం

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన శ్రీజ రెడ్డి

- నవంబర్ 2న వాకింగ్‌కు వెళ్లి కనిపించకుండా పోయిన యువతి
- భారత కాన్సులేట్, తానా సహకారం కోరిన మంత్రి కోమటిరెడ్డి

2



4.5 లక్షల మందికి కొత్తగా పింఛన్లు

- రాష్ట్రవ్యాప్తంగా కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం నిర్ణయం
- నేడు కోడంగల్‌లో పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

2

శ్మశానంలో బతుకుతున్న అమృతకు బండి ఆపన్నహస్తం



బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

వివరాలు 3లో..

వాయుసేన ప్రపంచ రికార్డు!

- 13,629 అడుగుల ఎత్తులో భారీ రవాణా విమానం ల్యాండింగ్
- లద్దాఖ్‌లోని న్యోమా వైమానిక స్థావరంలో చరిత్ర సృష్టించిన ఐఎల్-76ఎండీ
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఈ తరహా విమానం ల్యాండింగ్

4





ఈ20 పెట్రోల్‌పై మోదీ సమాధానం చెప్పాల్సిందే!

- నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారంటూ రాహుల్ గాంధీ ఆరోపణలు
- కొన్ని నమూనాల్లో 30 శాతం దాటిందన్న కాంగ్రెస్ అగ్రనేత

4



ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలి

సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్

కాలుష్యానికి తావులేకుండా సురక్షితంగా వేడుకలు జరుపుకోవాలని పిలుపు

హైదరాబాద్, నవంబర్ 7 (చురకలు): శోభాయమానమైన దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీపాల కాంతులు ప్రతి ఇంటా నిండి ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని వేర్వేరు సందేశాల్లో నేతలు ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం తన పాలన ద్వారా ప్రజల జీవితాల్లోని కష్టాల చీకట్లను పారద్రోలి, బతుకుల్లో కొత్త వెలుగులు నింపే లక్ష్యంతో ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. పండుగ సంబరాల వేళ పర్యావరణ పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా కాలుష్య రహితంగా సురక్షిత వాతావరణంలో వేడుకలు చేసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. అజ్ఞానపు చీకట్లను తొలగించుకుని జ్ఞానకాంతులను ఆహ్వానించాలనే మహత్తర సందేశాన్ని దీపావళి పండుగ అందిస్తోందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల కష్టాలన్నీ తొలగిపోయి సకల ఐశ్వర్యాలు, సర్వ సంపదలు చేకూరేలా, రాష్ట్రం తిరిగి ప్రగతి పథంలో పయనించేలా లక్ష్మీదేవి అమ్మవారి దివ్య కరుణాకటాక్షాలు లభించాలని ప్రార్థించారు. బాణాసంచా కాల్చే సమయంలో చిన్న పెద్ద అందరూ తగిన రక్షణ జాగ్రత్తలు వహిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా పండుగ జరుపుకోవాలని కేసీఆర్ సూచించారు.

బోస్టన్‌లో తెలంగాణ యువతి అదృశ్యం



నల్గొండ, నవంబర్ 7: అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న తెలంగాణకు చెందిన 23 ఏళ్ల యువతి అదృశ్యం కావడం కలకలం రేపింది. నల్గొండ జిల్లా కనగల్ మండలం శబ్దుల్లపురానికి చెందిన శ్రీజ రెడ్డి బోస్టన్‌లో కనిపించకుండా పోయింది. ఏడాదిన్నర క్రితం ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఆమె అక్కడ చదువుకుంటూనే పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తోంది. ఇటీవల స్వగ్రామానికి వచ్చి నెల రోజుల పాటు కుటుంబ సభ్యులతో గడిపి తిరిగి అమెరికా వెళ్లింది. నవంబర్ 2న సాయంత్రం కాలేజీ నుంచి గదికి చేరుకున్న శ్రీజ వాకింగ్ కోసం బయటకు వెళ్లింది. సుమారు కిలోమీటరు నడిచిన తర్వాత ఆమె ఆచూకీ తెలియకుండా పోయింది. అప్పటి నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. నవంబర్ 3న పోలీసులకు ఫిర్యాదు అందగా, నవంబర్ 4న బోస్టన్ పోలీస్ శాఖ మిస్సింగ్ అలర్ట్ జారీ చేసింది. శ్రీజ ఆచూకీ గుర్తించేందుకు ప్రజల సహకారం కోరింది. కార్సన్ బీచ్, హార్బర్ పాయింట్ ప్రాంతాల్లో ఆమె ఉండే అవకాశాలపై పోలీసులు గాలిస్తున్నారు. చివరిసారిగా నల్లని జాకెట్, నీలిరంగు జీన్స్ ధరించినట్లు వివరాలు వెల్లడించారు. శ్రీజను సురక్షితంగా తీసుకొచ్చేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బోస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్, కేంద్ర విదేశాంగ శాఖ అధికారులతో పాటు స్థానిక పోలీసులను సంప్రదించారు. గాలింపు చర్యల్లో సహకరించాలని తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ప్రతినిధులను కోరారు. మరోవైపు కుమార్తె ఆచూకీ తెలియక ఆమె తండ్రి కోయ యాదగిరిరెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీజ క్షేమంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు.

4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు

రాష్ట్రవ్యాప్తంగా కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం నిర్ణయం

నేడు కోడంగల్‌లో పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

హైదరాబాద్, నవంబర్ 7: తెలంగాణలోని నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పండుగ కానుక అందించనుంది. ప్రజా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మరో 4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. నవంబర్ 8న వికారాబాద్ జిల్లా కోడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్వయంగా పాల్గొని, లబ్ధిదారులకు నూతన పింఛన్ల మంజూరు పత్రాలను అందజేయనున్నారు. సామాజిక భద్రతకు ప్రాధాన్యమిస్తూ కొత్త లబ్ధిదారుల ఎంపిక చేపట్టినట్లు మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నేత, గీత కార్మికులతో పాటు ఇతర అర్హులకు ఈ పింఛన్లు అందనున్నాయి. కోడంగల్‌లో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ పంపిణీ చేపట్టనున్నారు. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తారు. కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు నవంబర్ నెల నుంచే పింఛన్ సొమ్మును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా పింఛన్లు అందిస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు. కొత్త పింఛన్ల మంజూరుతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది.

ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే.. రైతులూ అప్రమత్తం!

మొదటి పేజీ తరువాయి

పాల్గొన్నారు. రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమై హకీంపేటలో నిర్మిస్తున్న విద్యా కేంద్రం పనులను పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో సాగునీటి పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలు, రాజకీయ అంశాలపై మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉంటుందని, అయితే తెలంగాణలో మాత్రమే కరవు వచ్చినట్లు బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. రాబోయే వేసవిలో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టుల్లోని నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని వివరించారు. ఈ నేపథ్యంలో రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటల వైపు మొగ్గుచూపాలని సూచించారు. రైతులు నష్టపోకుండా ముందుగానే అప్రమత్తం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు నీరు వెళ్తోందన్న బీఆర్ఎస్ ఆరోపణలను సీఎం ఖండించారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి పంపుహౌస్ నుంచి ఎత్తిపోతలు చేపట్టే అవకాశం ఉంటుందని వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను దించే పరిస్థితి కూడా లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, నిర్మాణ లోపాల కారణంగానే కాళేశ్వరం పరిధిలోని మూడు బ్యారేజీలు పూర్తిస్థాయిలో పనిచేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన దేవాదుల వంటి ప్రాజెక్టులే ప్రస్తుతం రైతులకు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. పాలమూరు ప్రాంతం నుంచి గెలిచిన కేసీఆర్ భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ అక్కడి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని రేవంత్ విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి పేరు, స్థలం, అంచనాలు మార్చి చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలోనే దెబ్బతిన్నదని ఆరోపించారు. వచ్చే డిసెంబరులో ప్రత్యేక శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు స్పీకర్ అనుమతి కోరుతున్నామని తెలిపారు. ఆ సమావేశాల్లో ఎల్‌నినో ప్రభావం, కాళేశ్వరం ప్రాజెక్టు అంశాలపై సమగ్ర చర్చకు సిద్ధమని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం అంచనాల పెంపుపై కేటీఆర్ చేస్తున్న విమర్శలను సీఎం తిప్పికొట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొడంగల్ ప్రాంత అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షల పరిహారం ఇచ్చేందుకు కూడా అప్పటి ప్రభుత్వం ముందుకు రాలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం అందిస్తోందని వెల్లడించారు. హైదరాబాద్--లగచర్ల ప్రాంతాన్ని ఫ్లీ-నోయిడా తరహాలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రముఖ పరిశ్రమలు ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు. హకీంపేటలో 250 ఎకరాల్లో విద్యా కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.

గడ్డం పెంచితే రేవంత్ కాలేరు!

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వేషభాషలు మార్చుకున్నంత మాత్రాన ప్రజల విశ్వాసాన్ని పొందలేరని అన్నారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరంటూ ఎద్దేవా చేశారు. తాను మూడేళ్లుగా గంట కూడా సెలవు తీసుకోకుండా ప్రజల కోసం పనిచేస్తున్నానని పేర్కొన్నారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే తమ తీర్పును వెల్లడించారని అన్నారు. అసత్య ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగ అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించడంతోపాటు ప్రజల సమస్యలను తెలుసుకుంటానని తెలిపారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఎదురైతే ప్రజలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందని చెప్పారు. రైతులు కూడా పరిస్థితులను అర్థం చేసుకుని నీటిని పొదుపుగా వినియోగించాలని, సాగులో జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.



ధాన్యం నిల్వకు ఆధునిక సైలోలు

- తేమ పరీక్ష, శుభ్రపరచడం, ఆరబెట్టడం, నిల్వకు ఒకేచోట సదుపాయాలు
- పౌర సరఫరాల సంస్థ ద్వారా నేరుగా, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటుకు రెండు నమూనాలు
- సచివాలయంలో ప్రతిపాదనలను సమీక్షించిన మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, నవంబర్ 7 : వరి ధాన్యాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో ఆరబెట్టి నాణ్యతను కాపాడుతూ ఎక్కువ కాలం భద్రపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సైలోల వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. సచివాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైలోల నిర్మాణం, నిర్వహణ, నిధుల సమీకరణపై సమీక్షించారు. పంట కోత తర్వాత నిల్వ నష్టాలను తగ్గించడం, మార్కెట్‌లో ధర అనుకూలించే వరకు రైతులు ధాన్యాన్ని భద్రపరచుకునే వీలు కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ధాన్యాన్ని పెద్ద మొత్తంలో నేరుగా నిల్వ చేయగల భారీ ఉక్కు గిద్దంగులే సైలోలు. ప్రతిపాదిత సైలో కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసేందుకు తూకం వంతెనలు, తేమ, నాణ్యతను పరీక్షించేందుకు ప్రయోగశాల ఏర్పాటు చేయనున్నారు. కేంద్రానికి వచ్చిన ధాన్యంలో మట్టి, చెత్త వంటి మలినాలను యంత్రాల సాయంతో తొలగిస్తారు. తేమ ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని డ్రయర్లతో ఆరబెట్టి, సురక్షిత నిల్వకు అనువైన స్థాయికి తేమను తగ్గిస్తారు. ఆరబెట్టిన ధాన్యాన్ని యాంత్రిక పరికరాల సాయంతో నేరుగా ఉక్కు సైలోల్లోకి తరలించి నిల్వ చేస్తారు. ఈ పద్ధతిలో గోనె సంచుల వినియోగం తగ్గుతుంది. నిల్వ సమయంలో ధాన్యం నాణ్యతను పరీక్షించేందుకు, పురుగుల బెడదను నియంత్రించేందుకు అవసరమైన ఏర్పాట్లనూ ప్రతిపాదించారు. మొదటి నమూనాలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ గుర్తింపు పొందిన ఆర్థిక సంస్థల నుంచి రుణాలు సమీకరించి నేరుగా సైలోలను ఏర్పాటు చేయనుంది. రెండో నమూనాలో తొలి దశలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తించనున్న సుమారు 20 ప్రదేశాల్లో ప్రైవేటు పారిశ్రామికవేత్తలు సైలోలను ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తారు. పెట్టుబడులు ఆర్థికంగా ఆచరణ సాధ్యమయ్యేందుకు పౌర సరఫరాల సంస్థ నిర్ణీత కాలానికి అద్దె చెల్లింపుల హామీ ఇచ్చే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. సైలోల నిర్మాణ, నిర్వహణ వ్యయాలు, నిధుల సమీకరణ, అద్దె చెల్లింపు బాధ్యతలను అంచనా వేయాలని మంత్రి అధికారులను కోరారు. తక్కువ వడ్డీకి ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అనువైన ప్రదేశాలను గుర్తించి, ఆర్థిక, సాంకేతిక నిపుణులతో సంప్రదించి ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేయాలన్నారు. పంట కోసిన సమయంలో ధాన్యంలో సాధారణంగా సుమారు 25 శాతం తేమ ఉంటుందని మంత్రి వివరించారు. ఆరబెట్టే, భద్రంగా నిల్వ చేసే సదుపాయాలు లేక చాలామంది రైతులు అప్పటి మార్కెట్ ధరకే, కొన్నిసార్లు కోత ముగిసిన 24 గంటల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. సైలో కేంద్రాల్లో శాస్త్రీయంగా ఆరబెట్టి నిల్వ చేసే వీలు కలిగితే రైతులు ధర అనుకూలించినప్పుడు ధాన్యాన్ని అమ్ముకోగలుగుతారని చెప్పారు. ప్రీమియం వరి రకాల ధాన్యంలో తేమ సుమారు 25 శాతం ఉన్నప్పుడు క్వింటాలుకు రూ.3,500 నుంచి రూ.4,500 వరకు ధర పలుకుతోందని మంత్రి పేర్కొన్నారు. అదే ధాన్యాన్ని శాస్త్రీయంగా ఆరబెట్టి తేమను సుమారు 12 శాతానికి తగ్గిస్తే క్వింటాలుకు రూ.5,000 నుంచి రూ.5,500 వరకు ధర పలికే అవకాశం ఉందని వివరించారు. జేఎస్ఆర్, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ వంటి తెలంగాణ వరి రకాలకు దేశీయ, విదేశీ మార్కెట్లలో ఆదరణ పెరుగుతోందని, కొన్ని మార్కెట్లలో జేఎసఆర్ బియ్యం బాస్మతి కంటే అధిక ధర పలుకుతోందని మంత్రి పేర్కొన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రాష్ట్రంలో ప్రధాన పంట అయిన వరికి మెరుగైన నిల్వ సదుపాయాలు కల్పించడం వ్యవసాయరంగ వృద్ధికి, రాష్ట్ర జీడీపీ పెరుగుదలకు దోహదపడుతుందని చెప్పారు. మడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న తెలంగాణ లక్ష్యానికి ఇది తోడ్పడుతుందన్నారు. సమీక్షలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర, అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

దోచుకున్నది చాలక మళ్లీ అధికారం కోసం కలలు

- సీఎం కుర్చీ కోసం ప్రతిపక్ష నేత ప్రమాణస్వీకార రిహార్సల్స్
- ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు నింపుదాం
- రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి



హైదరాబాద్, నవంబర్ 7 (చురకలు): గతంలో ఇందిరమ్మ ప్రభుత్వాలు పేదలకు ఇళ్లు, స్థలాలు మంజూరు చేస్తే నాటి బీఆర్ఎస్ పాలకులు వాటిని నిర్దాక్షిణ్యంగా కొల్లగొట్టారని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ధరణి పేరిట భూదోపిడీ, కాళేశ్వరం పేరిట భారీ అవినీతికి పాల్పడి రాష్ట్రానికి రూ.8.25 లక్షల కోట్ల అప్పుల భారాన్ని మిగిల్చారని ధ్వజమెత్తారు. ఆ అప్పుల కారణంగా నెలకు రూ.6,500 కోట్లను ప్రజాప్రభుత్వం వడ్డీ రూపేణా చెల్లిస్తోందని వివరించారు. రంగారెడ్డి జిల్లా నందిగామలో ఎంపీడీవో కార్యాలయ ప్రారంభం, ఎమ్మార్వో కార్యాలయ భవన శంకుస్థాపనతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి కష్టపడుతుంటే, మరోవైపు రానున్న కాలంలో తానే సీఎం అవుతానన్న భ్రమతో ఓ ప్రముఖుడు ఇప్పటినుంచే ప్రమాణస్వీకారోత్సవానికి రిహార్సల్స్ వేస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో రెండేసి జిల్లాలను పంచుకుని దోపిడీకి పాల్పడిన నేతలు ఇప్పుడు నాలుగేసి జిల్లాలు కావాలంటూ ఒత్తిడి తెస్తున్నారని, వారి కలలు కల్లలు కాక తప్పవని అన్నారు. ముందు నీ నియోజకవర్గంలో గెలిచి, ఆ తర్వాత సీఎం పీఠం గురించి ఆలోచించాలని హితవు పలికారు. ప్రజా ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేయకపోతే తల వేయి ముక్కలవుతుందన్న భయంతో ప్రతిపక్ష నేతలు అసత్యాలు చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వపు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను కొనసాగించడమే ప్రజా ప్రభుత్వ భేషజాలు లేని పాలనకు నిదర్శనమన్నారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు రూ.73 వేల కోట్లను సున్నా వడ్డీకి డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రతి నిరుపేద కుటుంబానికి ఆత్మగౌరవం, భద్రత కల్పించేందుకు ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని, ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు మంజూరు చేసిన 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో 2,25,100 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రానున్న కాలంలో మరిన్ని ఇళ్లు ఇస్తామన్నారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లలో ఆనందోత్సాహాలు జరుపుకునేందుకు శనివారం నుంచి 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరిట వేడుకలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సచివాలయంలో హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలోనూ ఈ పండుగ రూపకల్పనను ఆయన స్పష్టం చేశారు.

'భూభారతి' సంస్కరణలు.. నందిగామకు వరాలు

ధరణి లోపాలను సరిదిద్ది భూసమస్యలు లేకుండా చేసేందుకు 'భూభారతి' పేరిట సంస్కరణలు తెస్తున్నామని, ఏడాదిన్నరలో 10,456 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి ప్రతి భూమికి పట్టా, మ్యాప్‌లతో పాటు ఆధార్ నంబర్ తరహాలో ప్రత్యేక 'భూధార్' నంబర్ ఇస్తామని వెల్లడించారు. ఈనెల 19న సిద్ధిపేట వేదికగా చిలక పచ్చరంగు బతుకమ్మ చీరలను మహిళలకు అందజేస్తామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే శంకరన్న అభ్యర్థన మేరకు నందిగామకు ఆర్డీవో కార్యాలయ భవనం, ఎమ్మార్వో కార్యాలయ భవనం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సిద్ధాపురంలో డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలిస్తామని, వెంగిరాల, వెంజెళ్ల ప్రాంతాల్లోని భూసమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కేంద్రంగా హైదరాబాద్

- 'ఆర్థా ఫిన్‌టెక్' కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, నవంబర్ 7 : ఫిన్‌టెక్, గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలకు హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ప్రపంచస్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్‌లో పరిశోధన, అభివృద్ధి(ఆర్ అండ్ డీ)కి ప్రోత్సాహం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న ఆర్థా ఫిన్‌టెక్ హైదరాబాద్ కార్యాలయాన్ని హైటెక్ సిటీలో ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఐటీ/ఐటీఈఎస్ రంగంలో హైదరాబాద్ సాధించిన అంతర్జాతీయ గుర్తింపును ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్, గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలకూ విస్తరించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో భాగంగా పెట్టుబడులకు, ఆవిష్కరణలకు, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌కు దేశంలోనే అత్యుత్తమ గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. గ్లోబల్ కంపెనీలు తమ కార్యకలాపాలను హైదరాబాద్‌కు విస్తరించేలా ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజీ ఎకో సిస్టం"ను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. బ్యాంకింగ్-యాజ్-ఏ-సర్వీస్, ఓపెన్ బ్యాంకింగ్ ఏపీఐలు, ఆటోమేటెడ్ ఆన్‌బోర్డింగ్, కేవైసీ/కేవైబీ, ఏఎంఎల్, అంతర్జాతీయ చెల్లింపులు, డిజిటల్ వాలెట్ మౌలిక సదుపాయాలు తదితర ఫైనాన్షియల్ టెక్నాలజీ పరిష్కారాలను ఆర్థా ఫిన్‌టెక్ అందిస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. కార్యక్రమంలో కంపెనీ సీఈవో మధుబాబు గడిపాటి, ఆర్మిన్ ఒర్డోడరీ, ఇమాన్యుయేల్ సి. ఫెర్నాండెస్ తదితరులు పాల్గొన్నారు.

ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలి

- అటవీ సంపదతోపాటు ఆదివాసీల జీవనోపాధికి ప్రాధాన్యం
- అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ సీఎస్‌తో మంత్రి సీతక్క సమీక్ష



ములుగు, నవంబర్ 7 : ములుగు జిల్లాలో విస్తారంగా ఉన్న అటవీ, ప్రకృతి సంపదను పరిరక్షిస్తూనే పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి స్థానిక ఆదివాసీ గిరిజనులకు జీవనోపాధి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. అటవీ సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ములుగులో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ములుగు జిల్లాకు వచ్చిన జయేష్ రంజన్ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రి సీతక్కతో శనివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అటవీ ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణ, ఎకో టూరిజం అభివృద్ధి, ఏజెన్సీ ప్రాంతాల మౌలిక వసతులు, ఆదివాసీ గిరిజనుల జీవనోపాధి తదితర అంశాలపై ఇరువురూ విస్తృతంగా చర్చించారు. జిల్లాకు ఉన్న ప్రత్యేక భౌగోళిక, ప్రకృతి వనరుల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాలని మంత్రి సూచించారు. జిల్లాలోని దట్టమైన అడవులు, కొండలు, వాగులు, జలపాతాలు, సహజసిద్ధమైన ప్రకృతి ప్రాంతాలు పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉన్నాయని, అయితే పర్యాటక అభివృద్ధి పేరుతో అటవీ సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడాలని సూచించారు. ప్రకృతిని కాపాడుతూ పర్యాటకులను ఆకర్షించే విధంగా ఎకో టూరిజం కేంద్రాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్థానిక ప్రజలను, ముఖ్యంగా ఆదివాసీ గిరిజనులను ఈ అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములను చేయడం ద్వారా వారికి స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పించవచ్చన్నారు. స్థానికంగా లభించే అటవీ ఉత్పత్తులు, హస్తకళలు, సంప్రదాయ కళలు, ఆహార ఉత్పత్తులు తదితరాలను పర్యాటక రంగంతో అనుసంధానం చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ములుగు ప్రకృతి సంపదను పరిరక్షించడంతో పాటు స్థానిక ప్రజల ఆదాయాన్ని పెంచే విధంగా అభివృద్ధి కొనసాగాలని అన్నారు. అటవీ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఇతర అత్యవసర మౌలిక వసతుల కోసం చేపట్టే అభివృద్ధి పనులకు కేంద్ర అటవీ, పర్యావరణ అనుమతుల ప్రక్రియలో అనవసర జాప్యం లేకుండా చూడాలని కోరారు. ఏజెన్సీ గ్రామాల ప్రజలకు మౌలిక వసతులు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, అభివృద్ధి పర్యావరణ పరిరక్షణ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని జయేష్ రంజన్‌ను మంత్రి కోరారు. జిల్లా ప్రకృతి సంపదను భవిష్యత్ తరాలకు కాపాడుతూ అదే సమయంలో అక్కడి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ దిశగా అటవీ, పర్యావరణ శాఖతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓతోపాటు అటవీ, పర్యావరణ, జిల్లా పరిపాలనకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డిఫెన్స్ మద్యం అక్రమ విక్రయాలపై
ఎక్సైజ్ దాడులు

ఆల్వాల్ పరిధిలో రెండు చోట్ల తనిఖీలు

లోతుకుంటలో 96, బోయిన్‌పల్లిలో 67 బాటిళ్లు స్వాధీనం



హైదరాబాద్, నవంబర్ 7: డిఫెన్స్ క్యాంటీన్ల ద్వారా మాజీ సైనికులకు తక్కువ ధరకు లభించే మద్యం అక్రమ విక్రయాలకు తెరలేపిన కొందరిపై ఎక్సైజ్ శాఖ చర్యలు చేపట్టింది. క్యాంటీన్ల నుంచి మద్యం తీసుకొచ్చి ఇళ్లలో నిల్వ ఉంచి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఆల్వాల్ ప్రాంతంలో రెండు చోట్ల దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 163 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ప్రదీప్‌రావు నేతృత్వంలోని బృందం సరస్వతీనగర్, లోతుకుంటలో మన్యం నాగప్రసన్న, రామాంజనేయులు దంపతుల ఇంట్లో సోదాలు చేసింది. ఈ సందర్భంగా 96 డిఫెన్స్ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. మాజీ సైనికుడైన రామాంజనేయులు తనతో పాటు ఇతరుల మద్యం కోటా ద్వారా క్యాంటీన్ల నుంచి బాటిళ్లు తీసుకొస్తుండగా, భార్య నాగప్రసన్న వాటిని స్థానికులకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. దీంతో ఆమెను అరెస్టు చేసి ఆల్వాల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. మరోవైపు న్యూ బోయిన్‌పల్లి సౌజన్య కాలనీలో ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ సీఐ గణపతిరెడ్డి బృందం తనిఖీలు నిర్వహించింది. ముసిమి లెంక (39) ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 67 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. ఆమెను అదుపులోకి తీసుకుని ఆల్వాల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించింది. రెండు దాడుల్లో పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ. 2.11 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. డిఫెన్స్ క్యాంటీన్ల ద్వారా లభించే మద్యం వెసులుబాటును దుర్వినియోగం చేస్తూ అక్రమ విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు.

తెలంగాణ ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 1,625 పీజీ సీట్లు

కొత్తగా 359 సీట్లకు జాతీయ వైద్య కమిషన్ ఆమోదం

హైదరాబాద్, నవంబర్ 7: తెలంగాణలో వైద్య విద్య, ప్రభుత్వ వైద్య సేవల విస్తరణకు మరో ముందడుగు పడింది. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అదనంగా 359 పీజీ సీట్లను కేటాయించేందుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఆమోదం తెలిపింది. దీంతో ఇప్పటివరకు 1,266గా ఉన్న పీజీ సీట్ల సంఖ్య 1,625కు చేరింది. గతంలో రాష్ట్రంలోని 10 ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే పీజీ కోర్సులు అందుబాటులో ఉండగా, తాజా అనుమతులతో ఆ సంఖ్య 23కు పెరిగింది. మొత్తం 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 23 చోట్ల పీజీ విద్య అందుబాటులోకి రానుంది. నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, వనపర్తి, మంచిర్యాల, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, ఖమ్మం, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, నిర్మల్, సంగారెడ్డి, నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలల్లో తొలిసారిగా పీజీ సీట్లు మంజూరయ్యాయి. కాలేజీల్లో అధ్యాపకుల నియామకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త భవనాల నిర్మాణం, అనుబంధ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సదుపాయాల కల్పనతో అదనపు సీట్లకు మార్గం సుగమమైంది. జాతీయ వైద్య కమిషన్ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా వసతులు మెరుగుపడటంతో ఈ అనుమతులు లభించాయి. పీజీ సీట్ల పెంపుతో జిల్లా కేంద్రాల్లోనే వివిధ వైద్య విభాగాల నిపుణులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల సంఖ్య పెరిగితే స్థానిక ప్రజలకు మెరుగైన చికిత్స అందుతుంది. ఎంబీబీఎస్ పూర్తిచేసిన రాష్ట్ర విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే ఉన్నత వైద్య విద్యను అభ్యసించేందుకు అవకాశాలు విస్తరిస్తాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని 1,625 పీజీ సీట్లతో పాటు నిమ్స్‌లో అదనంగా 107, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో 106 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటు వైద్య కళాశాలల్లోనూ సుమారు 2,600 పీజీ సీట్లు ఉన్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి.

శ్మశానంలో బతుకుతున్న అమృతకు బండి సంజయ్ ఆపన్నహస్తం!

బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

తక్షణమే ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరిన బండి



సిరిసిల్ల, నవంబర్ 7 (చురకలు): సొంత ఇల్లు లేక స్మశానమే నివాసంగా మార్చుకుని అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడితో కలిసి దుర్భర జీవితాన్ని గడుపుతున్న చందుర్తి మండలం కిష్టంపేటకు చెందిన మర్రిపల్లి అమృతకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బాసటగా నిలిచారు. అమృతకు తక్షణ సాయంగా రూ.50 వేలు పంపారు. ఈ నగదు మొత్తాన్ని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ద్వారా బాధితురాలకు అందజేశారు. దీంతోపాటు జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ తో కేంద్ర మంత్రి ఫోన్లో మాట్లాడుతూ అమృత దుస్థితిని వివరించారు. అమృతకు తక్షణమే డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. మరోవైపు అనారోగ్యం బారిన పడిన కొడుకుతో కలిసి శ్మశానంలో నివసిస్తూ పుట్టెడు దుఃఖంలో ఉన్న అమృతకు అన్ని విధాలా అండగా ఉండాలని బండి సంజయ్ పార్టీ శ్రేణులను ఆదేశించారు. డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరైన వెంటనే ఆ ఇంటికి అవసరమైన సామాగ్రితోపాటు కుటుంబానికి సరిపడా నిత్యావసర సరుకులను అందించాలని కోరారు.

సాగునీటి ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్ దోపిడీ

కొడంగల్-నారాయణపేట-మక్తల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ



హైదరాబాద్, నవంబర్ 7 : కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీకి ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యవహారంపై ఆయన సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. తలకిందులుగా పడినా తమదే గెలుపు అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారం ఉందని వ్యాఖ్యానించారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం టెండర్లు పిలిస్తే మంత్రి పొంగులేటికి చెందిన సొంత కంపెనీ కూడా టెండర్లలో పాల్గొన్నదని ఆరోపించారు. మిగతా కంపెనీలన్నీ కాగితాలపైనే ఉన్న నామమాత్రపు సంస్థలని, చివరకు ఒక్క కంపెనీ మాత్రమే పోటీలో మిగిలి విజయం సాధించేలా వ్యవహారం నడిచిందని విమర్శించారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం భారీగా పెరిగిపోవడంపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం రూ.6,825 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. అంటే దాదాపు ఐదు రెట్లు వ్యయం పెరిగిందని, ప్రజాధనాన్ని ఈ స్థాయిలో ఖర్చు చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు ప్రాజెక్టు ద్వారా ఒక్క చుక్క నీరు కూడా అందలేదని విమర్శించారు. అంచనా వ్యయాన్ని భారీగా పెంచుతూ టెండర్ల ప్రక్రియను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. టెండర్లలో పారదర్శకతకు తావులేకుండా తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు దక్కేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని మండిపడ్డారు. ఒకవైపు ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంటే మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచి కాంట్రాక్టుల ద్వారా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించి ఇలాంటి దోపిడీకి సరిపోయే కొత్త పదాన్ని సూచించాలని కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. జరుగుతున్న ఈ దోపిడీని వివరించడానికి క్రోనీ క్యాపిటలిజం, బహిరంగ దోపిడీ, క్లెప్టోక్రసీ వంటి పదాలు కూడా సరిపోవడం లేదని వ్యాఖ్యానించారు.

డిండి నీటి సమస్యకు నదుల అనుసంధానమే పరిష్కారం

ఏదుల నుంచి డిండికి నీళ్లు తేవడం అసాధ్యం

బస్వాపూర్ మీదుగా గోదావరి జలాల తరలింపు

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



నల్గొండ, నవంబర్ 7: డిండి రిజర్వాయర్‌కు ఏదుల నుంచి నీటిని తరలిస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి రెండు జిల్లాల ప్రజలను మోసం చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఏదులకే రెండు టీఎంసీల నీటిని తీసుకురాలేని పరిస్థితుల్లో డిండికి ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. శనివారం డిండి రిజర్వాయర్ వద్ద పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తన ప్రతిపాదనలను వివరించారు. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానంతోనే డిండి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కాళేశ్వరం అదనపు టీఎంసీ ద్వారా బస్వాపూర్ మీదుగా డిండికి నీటిని అందించవచ్చని తెలిపారు. బస్వాపూర్ పనులు 80 శాతం పూర్తయ్యాయని, వాటిని వేగంగా ముగించాలని సూచించారు. ఏదుల నుంచి నీటిని తరలించే ప్రతిపాదనకు అవసరమైన సర్వేలు, సాంకేతిక ఆధారాలు ఏమిటో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిసార్లు సర్వేలు చేసినా డిండికి నీటి వనరును గుర్తించలేకపోయిందని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు శ్రీశైలాన్ని సోర్స్‌గా ఎంచుకోవడం కూడా తప్పిదమేనని అంగీకరిస్తూ, గత ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నందుకు క్షమాపణలు కోరారు. ఏటా గోదావరి నుంచి 3,500 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తున్నా వినియోగించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కొత్త ప్రతిపాదనలు చేపట్టడం సరికాదన్నారు. నల్గొండలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి దీర్ఘకాలం నదీ జలాలు అందించాలని, జిల్లాలో చిన్న రిజర్వాయర్లు నిర్మిస్తామని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ పరిష్కారాలు సూచిస్తున్న తమ పార్టీ అభ్యర్థులకు పట్టభద్రులు మద్దతు ఇవ్వాలని కవిత కోరారు.

పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ

సొంత ఆదాయాన్ని నేరుగా ఖాతాల్లో జమ చేసుకునే వెసులుబాటు

హైదరాబాద్, నవంబర్ 7: గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని పెంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీలు వివిధ మార్గాల ద్వారా సమకూర్చుకునే సొంత ఆదాయాన్ని ఇకపై నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు తెలంగాణ పంచాయతీరాజ్ (నాలుగో సవరణ) చట్టం-2026ను తీసుకొచ్చింది. అక్టోబర్ 9, 2026 నుంచి ఈ సవరణ అమల్లోకి వస్తుందని పేర్కొంటూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీవో ఎంఎస్ నెం.43ను జారీ చేసింది. గతంలో గ్రామ పంచాయతీలు సొంతంగా సమకూర్చుకున్న ఆదాయాన్ని తొలుత ప్రభుత్వ ఖజానాలో జమ చేయాల్సి వచ్చేది. ఆ తర్వాత అవసరమైన నిధులను తిరిగి పొందేందుకు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండటంతో అభివృద్ధి పనులకు ఆటంకాలు ఎదురయ్యేవి. ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, రహదారుల మరమ్మతులకు నిధులు అందడంలో జాప్యం జరిగేది. ఈ సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం చట్ట సవరణ చేపట్టింది. కొత్త నిబంధనలతో పంచాయతీల సొంత ఆదాయం నేరుగా వాటి బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. దీంతో స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వినియోగించుకునే అవకాశం కలగనుంది.

సంపాదకీయం



రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెరపడనుందా?

త్వరలోనే భారీ శాంతి ఒప్పందం కుదరవచ్చన్న ట్రంప్

చర్చలకు ఇరు దేశాలు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడి

యూరప్ భద్రత, నాటో పాత్రపైనా కీలక నిర్ణయాలకు అవకాశం

ప్రమాదకర ప్రతిపాదనలపై అప్రమత్తంగా ఉండాలన్న జెలెన్‌స్కీ


ఏళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఇరు దేశాలు యుద్ధాన్ని ముగించేందుకు ఒక ఒప్పందానికి రావడానికి ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు. త్వరలోనే భారీ శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం కేవలం రష్యా, ఉక్రెయిన్‌లకే పరిమితం కాకుండా యూరప్ దేశాల భద్రతకు సంబంధించిన అంశాలను కూడా కలిగి ఉండవచ్చని తెలిపారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రత్యేక ప్రతినిధి కిరిల్ దిమిత్రివ్‌తో వైట్‌హౌస్‌లో సమావేశమైన అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా, ఉక్రెయిన్ దేశాలు యుద్ధానికి ముగింపు పలికేందుకు ఒకే వేదికపైకి రావడానికి సిద్ధంగా ఉన్నట్లు తనకు అనిపిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య శాంతి నెలకొల్పే దిశగా పెద్ద ఒప్పందం కుదరవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ ఒప్పందం యూరప్ మొత్తానికి సంబంధించిన అంశాలను కూడా కలిగి ఉండే అవకాశం ఉందన్నారు. అయితే చర్చల ప్రతిపాదనలు, ఒప్పందం అమలుకు సంబంధించిన వివరాలు ఇంకా స్పష్టతకు రావాల్సి ఉంది. శాంతి ఒప్పందంలో యూరప్ భద్రత, నాటో పాత్ర, భవిష్యత్తులో మరోసారి యుద్ధం తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలు ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది. రష్యా-ఉక్రెయిన్ మధ్య నెలకొన్న వివాదానికి శాశ్వత పరిష్కారం లభించాలంటే భద్రతాపరమైన హామీలు కీలకమని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో యూరప్ దేశాల భాగస్వామ్యం కూడా చర్చల్లో ప్రధాన అంశంగా మారవచ్చని ట్రంప్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. మరోవైపు అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ అప్రమత్తంగా స్పందించారు. రష్యా, యూరప్ మధ్య భద్రతా ఒప్పందం కుదుర్చుకోవడం అంత సులభమైన విషయం కాదని పేర్కొన్నారు. కొన్ని ప్రతిపాదనలు భవిష్యత్తులో ప్రమాదకర పరిణామాలకు దారితీయవచ్చని హెచ్చరించారు. యుద్ధాన్ని ముగించే ఒప్పందం కుదరాలంటే ముందుగా ఇరు దేశాల మధ్య ఉన్న ప్రధాన సమస్యలకు పరిష్కారం లభించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపుపై ట్రంప్ వ్యక్తం చేసిన ఆశాభావం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే శాంతి ఒప్పందం కుదిరేందుకు ఇరు దేశాల అంగీకారంతోపాటు భద్రతా హామీలు, వివాదాస్పద అంశాలపై స్పష్టత అవసరం. ట్రంప్ వ్యాఖ్యలతో శాంతి ప్రయత్నాలపై ఆశలు పెరిగినప్పటికీ, అధికారిక ఒప్పందం కుదిరే వరకు యుద్ధం ముగింపుపై అనిశ్చితి కొనసాగనుంది.

ఈ20 పెట్రోల్‌పై మోదీ సమాధానం చెప్పాల్సిందే!

- **నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారంటూ రాహుల్ గాంధీ ఆరోపణలు**
- **కర్ణాటకలో పరీక్షించిన 14 నమూనాల్లో 11 చోట్ల అధిక మోతాదు గుర్తించినట్లు వెల్లడి**
- **కొన్ని నమూనాల్లో 30 శాతం దాటిందన్న కాంగ్రెస్ అగ్రనేత**
- **మైలేజీ తగ్గి వాహనదారులపై అదనపు భారం పడుతోందని విమర్శ**
- **ఇంధనంలో ఇథనాల్ శాతం ఎందుకు వెల్లడించడం లేదని నిలదీత**



న్యూఢిల్లీ, నవంబర్ 7 (చురకలు): దేశవ్యాప్తంగా వినియోగిస్తున్న ఈ20 పెట్రోల్‌లో నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మాత్రమే ఉంటుందని కేంద్రం చెబుతుండగా, వాస్తవంగా అంతకంటే ఎక్కువ మోతాదులో కలుపుతున్నట్లు కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో వెల్లడైందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వాహనదారుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఇంధన సరఫరా జరుగుతోందని ఆరోపిస్తూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కర్ణాటక ప్రభుత్వం ఏడు జిల్లాల్లోని పెట్రోల్ బంకుల నుంచి సేకరించిన 14 నమూనాలను గుర్తింపు పొందిన ప్రయోగశాలలో పరీక్షించగా, వాటిలో 11 నమూనాల్లో 20 శాతానికి మించి ఇథనాల్ ఉన్నట్లు తేలిందని రాహుల్ గాంధీ వెల్లడించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందిన ఒక నమూనాలో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం నమూనాలో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ చమురు సంస్థలతోపాటు ప్రైవేటు సంస్థల నమూనాల్లోనూ నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ ఉన్నట్లు ఆరోపించారు. పెట్రోల్‌లో ఇథనాల్ మోతాదు పెరగడం వల్ల వాహనాల మైలేజీ తగ్గడంతోపాటు కొన్ని వాహనాల్లో నిర్వహణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అధిక ధరలకు పెట్రోల్ కొనుగోలు చేస్తున్న ప్రజలు మైలేజీ తగ్గితే మరింత ఆర్థిక భారం భరించాల్సి వస్తుందని విమర్శించారు. ముఖ్యంగా పాత వాహనాలు, అధిక ఇథనాల్ మిశ్రమాలకు అనుగుణంగా రూపొందించని ఇంజిన్లపై ప్రభావం ఎలా ఉంటుందో ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. పెట్రోల్ బంకుల్లో విక్రయించే ఇంధనంలో వాస్తవంగా ఎంత శాతం ఇథనాల్ ఉందో వినియోగదారులకు తెలియజేసే పారదర్శక వ్యవస్థ లేకపోవడాన్ని రాహుల్ తప్పుబట్టారు. ప్రజలు కొనుగోలు చేస్తున్న ఇంధన నాణ్యత, మిశ్రమం గురించి తెలుసుకునే హక్కు వారికి ఉందని పేర్కొన్నారు. చమురు సంస్థల సొంత ప్రయోగశాలల పరీక్షలకు, కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల ఫలితాలకు మధ్య వ్యత్యాసం ఎందుకు వచ్చిందో వివరించాలని డిమాండ్ చేశారు. ఈ20 పేరుతో విక్రయిస్తున్న పెట్రోల్‌లో వాస్తవంగా ఎంత శాతం ఇథనాల్ కలుపుతున్నారు? నిర్దేశిత పరిమితిని మించినట్లు తేలితే సంబంధిత చమురు సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? వాహనదారులకు జరుగుతున్న నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు? ఇథనాల్ మిశ్రమ వివరాలను బహిరంగంగా ఎందుకు ప్రకటించడం లేదు? అంటూ రాహుల్ గాంధీ ప్రశ్నలు సంధించారు. ఇథనాల్ మిశ్రమ విధానం వల్ల నిజంగా ఎవరికి ప్రయోజనం కలుగుతోందో కేంద్రం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రభుత్వం నిర్వహించినట్లు పేర్కొన్న పరీక్షల ఫలితాలపై స్వతంత్ర పరిశీలన జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. ఈ20 పెట్రోల్‌పై రాహుల్ చేసిన ఆరోపణలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. అయితే నమూనాల పరీక్షల వివరాలు, ఇథనాల్ మోతాదుపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, చమురు సంస్థల అధికారిక వివరణతోనే పూర్తి స్పష్టత రానుంది.



దేశ ప్రజలకు ప్రధాని మోదీ దీపావళి శుభాకాంక్షలు!

న్యూఢిల్లీ, నవంబర్ 7 (చురకలు): పవిత్రమైన దీపావళి పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి జీవితాలు నిత్యం సుఖసంతోషాలతో, సకల విజయాలతో కాంతివంతంగా వెలిగిపోవాలని ఆయన ఆకాంక్షించారు. చెడుపై మంచి, చీకటిపై వెలుగు సాధించిన మహోన్నత విజయానికి దీపావళి పండుగ దివ్య ప్రతీక అని చెప్పారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా శనివారం ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని పోస్ట్ చేశారు. 'ఈ పవిత్రమైన దీపావళి పర్వదినం మీ జీవితాల్లో నిరంతరం ప్రశాంతతను, ఉన్నత విజయాలను, అలరారే సుఖసంతోషాలను అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని ప్రధాని తన సందేశంలో పేర్కొన్నారు. కాగా, గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రధాని మోదీ తన దీపావళి పండుగను సరిహద్దుల్లో దేశాన్ని రక్షిస్తున్న వీర సైనికులతో కలిసి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా అదే ఆనవాయితీని, సంప్రదాయాన్ని కొనసాగిస్తూ సైనికుల మధ్యనే దీపావళి సంబరాలను జరుపుకోనున్నట్లు ఆయన తన వీడియో సందేశంలో స్పష్టంగా వెల్లడించారు.

క్రమశిక్షణే సైనికుడిని యోధుడిగా మారుస్తుంది

రాజ్‌నాథ్ సింగ్!



కోల్‌కతా, నవంబర్ 7 (చురకలు): కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వాయుసేన సిబ్బందితో కలిసి దీపావళి వేడుకలు చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బాగ్‌డోగ్రా ఎయిర్‌ఫీల్డ్‌లో నిర్వహించిన వేడుకల్లో సైనికులకు ఆయన మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ.. భారత వైమానిక దళ సిబ్బంది ధైర్యం, క్రమశిక్షణ, అంకితభావాన్ని ప్రశంసించారు. మన సాయుధ దళాలు సరిహద్దుల్లో రేయింబవళ్లు కాపలాగా ఉండటం వల్లే, దేశ ప్రజలు ప్రతి పండగను ఆనందంగా, స్వేచ్ఛగా జరుపుకొంటున్నారని తెలిపారు. వారు చూపే ధైర్యం, నిస్వార్థ సేవకు యావత్ దేశం ఎంతో గర్వపడుతోందన్నారు. 'ఆపరేషన్ సిందూర్'తో మన వాయుసేన శక్తి ప్రపంచానికి తెలిసిందన్నారు. 'సైనికులలో ధైర్యం, క్రమశిక్షణ లేకపోతే అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా అది నిష్ప్రయోజనమే. మన సాయుధ దళాలు క్రమశిక్షణకు మారుపేరు. అదే ఒక సాధారణ సైనికుడిని అసాధారణ యోధుడిగా మారుస్తుంది. అదే సమయంలో డ్రోన్లు, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలతో సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలతో సాయుధ దళాలను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉంది. మీ అందరి సహకారంతో భారత్ మరింత ముందుకు వెళ్తుందని నాకు పూర్తి నమ్మకం ఉంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశంలో పెరుగుతోన్న రక్షణ ఉత్పాదక సామర్థ్యాలను రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. 'ఆత్మనిర్భర్ భారత్' దిశగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషి వల్లే దేశీయ స్టార్టప్‌లు, పరిశ్రమలు.. డ్రోన్‌లు, డ్రోన్ నిరోధక వ్యవస్థలు, సైనికుల కోసం అధునాతన పరికరాలను అభివృద్ధి చేస్తున్నాయన్నారు. భవిష్యత్తులో అన్ని రకాల ఆయుధాలు, క్షిపణులను సొంతంగా తయారు చేసుకునే స్థాయికి భారత్ ఎదగాలనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

ధైర్యముంటే నాపైకి బుల్డోజర్లు పంపండి

బీజేపీకి మమత సవాల్

కోల్‌కతా, నవంబర్ 7 (చురకలు): తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఇంటిపై బీజేపీ కార్యకర్తలు దాడి చేయడాన్ని బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. తమకు ఎదురు తిరిగిన వారిపైకి బుల్డోజర్లు పంపడం భాజపాకు అలవాటని దుయ్యబట్టారు. వారి దగ్గర ఎన్ని బుల్డోజర్లు ఉంటే అన్నీ తనపైకి పంపాలని సవాల్ చేశారు. 'మీ దగ్గర ఎన్ని బుల్డోజర్లు ఉన్నాయి? రండి, నేను మీ ముందే నిల్చొని ఉన్నాను. నాపై బుల్డోజర్లను నడపండి. మీరెంత ధైర్యవంతులో చూడాలనుకుంటున్నాను' అని భాజపాపై విమర్శలు గుప్పించారు. అభిషేక్‌ను ఆయన నివాసంలో పరామర్శించిన అనంతరం మమత ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ.. తృణమూల్ నేతలపై దాడులు చేయడమే కాకుండా కాళీఘాట్ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా జరుగుతోన్న కాళీ పూజలకు అంతరాయం కలిగిస్తోందని మమత ఆరోపించారు. పలు ప్రాంతాల్లో పూజలు నిర్వహించడానికి అనుమతులు రద్దు చేశారని.. కొన్ని చోట్ల ప్రధాన రహదారులపై పూజ చేసుకునేందుకు అనుమతిచ్చారని అన్నారు. ఈ మార్పులు ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం తెల్లవారుజామున కాళీఘాట్‌లో ఉన్న తన నివాసంపై భాజపా కార్యకర్తలు రాళ్లు, ఇటుకలతో దాడి చేసినట్లు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మమత ఆయన్ని పరామర్శించారు.



భారత వాయుసేన ప్రపంచ రికార్డు!

- **13,629 అడుగుల ఎత్తులో భారీ రవాణా విమానం ల్యాండింగ్**
- **లద్దాఖ్‌లోని న్యోమా వైమానిక స్థావరంలో చరిత్ర సృష్టించిన ఐఎల్-76ఎండీ**
- **ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఈ తరహా విమానం ల్యాండింగ్**
- **అత్యంత క్లిష్టమైన వాతావరణంలోనూ సత్తాచాటిన భారత వైమానిక దళం**
- **చైనా సరిహద్దు సమీపంలో మరింత బలోపేతమైన వ్యూహాత్మక సామర్థ్యం**



న్యూఢిల్లీ, నవంబర్ 7 (చురకలు): భారత వైమానిక దళం మరో అరుదైన ఘనత సాధించింది. సముద్ర మట్టానికి 13,629 అడుగుల ఎత్తులో భారీ రవాణా వి మానాన్ని విజయవంతంగా దింపి సరికొత్త చరిత్ర సృష్టిం చింది. తూర్పు లద్దాఖ్‌లోని న్యోమా వైమానిక స్థావరంలో భారత వైమానిక దళానికి చెందిన ఐఎల్-76ఎండీ భారీ రవాణా విమానం సురక్షితంగా దిగింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఈ తరహా విమానం ల్యాండింగ్ కావడం ఇదే తొలిసారని భారత వైమానిక దళం వెల్లడించింది. ఈ అద్భుత ఘట్టానికి సంబంధించిన చిత్రాలు, దృశ్యాలను సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పంచుకుంది. అత్యంత క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల్లో సాధించిన ఈ విజయం భారత వైమానిక దళ సాంకేతిక సామర్థ్యానికి, సిబ్బంది నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిందని పేర్కొంది. సాధారణంగా సముద్ర మట్టానికి అత్యంత ఎత్తులో ఉన్న ప్రాంతాల్లో విమానాల రాకపోకలు సవాళ్లతో కూడుకుని ఉంటాయి. అక్కడ గాలి సాంద్రత తక్కువగా ఉండటంతో విమాన ఇంజిన్ల పనితీరు, విమానాన్ని నియంత్రించే సామర్థ్యం ప్రభావితమవుతాయి. ముఖ్యంగా భారీ రవాణా విమానాలను దించడం, తిరిగి గాల్లోకి తీసుకెళ్లడం మరింత క్లిష్టమైన ప్రక్రియ. ఇలాంటి పరిస్థితుల్లో 13,629 అడుగుల ఎత్తులో ఉన్న న్యోమా వైమానిక స్థావరంలో ఐఎల్-76ఎండీ విమానాన్ని విజయవంతంగా దించడం విశేషంగా నిలిచింది. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న పైలట్లు, సాంకేతిక సిబ్బంది ప్రదర్శించిన కచ్చితత్వం, సమన్వయం, వృత్తి నైపుణ్యాన్ని భారత వైమానిక దళం ప్రశంసించింది. తూర్పు లద్దాఖ్‌లోని న్యోమా ప్రాంతం భారత్-చైనా వాస్తవ నియంత్రణ రేఖకు సమీపంలో ఉండటంతో వ్యూహాత్మకంగా అత్యంత ప్రాధాన్యం కలిగిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. సరిహద్దు ప్రాంతాల్లో సైనికుల తరలింపు, రక్షణ సామగ్రి రవాణా, అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలకు వైమానిక రవాణా కీలకంగా మారుతుంది. న్యోమా వంటి ఎత్తైన ప్రాంతాల్లో భారీ రవాణా విమానాలను నడపగల సామర్థ్యం పెరగడం ద్వారా సరిహద్దు ప్రాంతాలకు అవసరమైన సామగ్రిని మరింత సమర్థవంతంగా తరలించే అవకాశం ఉంటుంది. తాజా ల్యాండింగ్ భారత రక్షణ వ్యవస్థలో కీలక మైలురాయిగా నిలిచిందని వైమానిక దళం అభివర్ణించింది. ఐఎల్-76ఎండీ రష్యాలో రూపొందించిన నాలుగు ఇంజిన్ల భారీ రవాణా విమానం. సైనికులు, ఆయుధ సామగ్రి, వాహనాలు, ఇతర అవసరమైన సరకులను సుదూర ప్రాంతాలకు తరలించేందుకు దీనిని వినియోగిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో భారీ స్థాయిలో సామగ్రిని తరలించగల సామర్థ్యం ఈ విమానం ప్రత్యేకత. మారుమూల ప్రాంతాల్లో సైనిక కార్యకలాపాలకు మద్దతు అందించడంలోనూ ఈ విమానాలు కీలక పాత్ర పోషిస్తాయి. న్యోమా వైమానిక స్థావరంలో భారీ రవాణా విమానం విజయవంతంగా దిగడం భారత వైమానిక దళానికి గర్వకారణమని అధికారులు పేర్కొన్నారు. ఈ ఘనత ద్వారా అత్యంత ఎత్తైన ప్రాంతాల్లోనూ సంక్లిష్టమైన వైమానిక కార్యకలాపాలు నిర్వహించగల సామర్థ్యాన్ని చాటుకున్నట్లు తెలిపారు. సిబ్బంది నైపుణ్యం, విమాన సామర్థ్యం, సమర్థవంతమైన ప్రణాళిక సమన్వయంతోనే ఈ విజయం సాధ్యమైందని వివరించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఆదర్శ విద్యార్థుల ఎంపిక

- క్రీడల్లో ప్రతిభ చాటిన ఆరుగురు విద్యార్థులు..

అభినందించిన ప్రిన్సిపాల్ సతీష్ కుమార్..



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 07, :

పాఠశాల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్-19 బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇబ్రహీంనగర్‌లోని ఆదర్శ పాఠశాల, కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఈ ఘనత సాధించడం పట్ల పాఠశాల వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. రంగారెడ్డి జిల్లా కొంపల్లిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-19 బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఎంపికైన వారిలో హరినాథ్ (సీఈసీ ద్వితీయ సంవత్సరం), హర్షవర్ధన్ (బైపీసీ ద్వితీయ సంవత్సరం), అనన్య (ఎంపీసీ ద్వితీయ సంవత్సరం), వైష్ణవి (ఎంపీసీ ద్వితీయ సంవత్సరం), రత్నసిరి (బైపీసీ ద్వితీయ సంవత్సరం)తో పాటు విరు ఉన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ కుమార్, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, వారిని క్రీడల్లో ప్రోత్సహించిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గుండి ప్రవీణ్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు

- లబ్ధిదారుల ఇళ్ల వద్ద పండుగ సంబరాలు.. సంతోషం పంచుకున్న కౌన్సిలర్ మమత రాజు



సదాశివపేట, నవంబర్ 07, :

సదాశివపేట పట్టణంలో పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఇళ్లలో దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. పట్టణంలోని 12వ వార్డులో కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు ఆధ్వర్యంలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొని పండుగ సంతోషాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మమత రాజు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనేది జీవితకాల స్వప్నమని, ఆ కలను నిజం చేస్తూ సొంతింటిలోనే పండుగలు జరుపుకునేలా చేయడమే ప్రభుత్వ ఆశయమని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందించడం పేద కుటుంబాల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి నిరుపేద కుటుంబం సొంతింటి కలను నెరవేర్చుకుని, తమ ఇంట్లోనే ఆనందోత్సాహాల మధ్య దీపావళి జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఇందిరమ్మ ఇల్లు పేదల సొంతింటి కలకు ప్రతిరూపమని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు బిల్ కలెక్టర్ ప్రవీణ్, శ్రీకాంత్, పీహెచ్ఓ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మంగలి సురేఖ–గోపాల్, కర్ణకోట నీలి మల్లమ్మ–వెంకటేశం, శైలజ–సుబ్బు దంపతులతో పాటు పీఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

జువ్వాడికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సంజయ్, అడువాల జ్యోతి లక్ష్మణ్




హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 07, :

తెలంగాణ రాష్ట్ర తొలి వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా జువ్వాడి నర్సింగ్ రావు ప్రమాణ స్వీకార మహోత్సవం హైదరాబాద్‌లోని హకీంపేట జూపల్లి బాలమ్మ వెలమ కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ హాజరయ్యారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్యలతో కలిసి అడువాల జ్యోతి లక్ష్మణ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతనంగా వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జువ్వాడి నర్సింగ్ రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో వెలమ సామాజిక వర్గ అభివృద్ధికి మరింత ప్రాధాన్యత లభించాలని, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, జగిత్యాల ఆర్టీఏ సభ్యులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమటాల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ కౌన్సిలర్ వీరబత్తిని శ్రీనివాస్, రేపెల్లి హరికృష్ణ, మీరే కాసిం అలీ, మొయిజుద్దీన్ తదితర జగిత్యాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బాధల చీకట్లను చీల్చి జ్ఞానకాంతులు నింపాలి

- దీపావళి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలి
- ప్రముఖ చిత్రకారుడు రుస్తుం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 07, :

దీపావళి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందాలు, ఆశలు, జ్ఞానకాంతులు నింపాలని ప్రముఖ అంతర్జాతీయ చిత్రకారుడు రుస్తుం ఆకాంక్షించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని శనివారం రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో ఆయన రూపొందించిన 'జ్ఞానకిరణ దీపావళి' చిత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రుస్తుం మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, సమాజంలో ఆనందం, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. దీపావళి అంటే కేవలం దీపాలు వెలిగించే పండుగ మాత్రమే కాదని, అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసరింపజేసే గొప్ప సందేశమని పేర్కొన్నారు. చెడుపై మంచి, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి దీపావళి ప్రతీకగా నిలుస్తుందన్నారు. తెలంగాణతో పాటు దేశంలోని ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాలు వెల్లివిరియాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించాలని, పేదలకు సంక్షేమ ఫలాలు అందాలని ఆకాంక్షించారు. నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం తొలగిపోయి ప్రపంచవ్యాప్తంగా శాంతిభద్రతలు, సహజీవనం, ఐక్యత, మానవతా విలువలు పెంపొందాలని కోరారు. దీపావళి వేడుకలను ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా జరుపుకోవాలని, బాణసంచా కాల్చే సమయంలో చిన్నారులను దూరంగా ఉంచి తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వెలుగుల పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని పిలుపు నిస్తూ అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఎఫ్ అధ్యక్షురాలు జులేఖా రుస్తుం, నైరూప్య చిత్రకారుడు నహీం రుస్తుం, సహాయ ఆచార్యురాలు రుబీనా రుస్తుం, రహీమ్ మహ్మద్, కొండ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కలం నుంచి జాలువారిన కథల మాల 'పడిలేచిన కెరటం' పుస్తకావిష్కరణ

- బాలసాహిత్య కథల సంపుటిని ఆవిష్కరించడం అభినందనీయం
- మాజీ మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 07, :

విద్యార్థి దశలోనే సృజనాత్మక ఆలోచనలకు అక్షరరూపం ఇస్తూ బాలసాహిత్య కథల సంపుటిని రచించడం ఎంతో గొప్ప విషయమని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన చేతుల మీదుగా వరుకోలు లక్ష్మయ్య సంపాదకత్వంలో జక్కుల లోహిత రచించిన 'పడిలేచిన కెరటం' కథల సంపుటి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాహిత్యం, రచనా రంగాలపై ఆసక్తి పెంపొందించుకోవడం అభినందనీయమన్నారు. చిన్న వయసులోనే కథలు రచించి పుస్తక రూపంలో తీసుకురావడం లోహిత ప్రతిభకు, సృజనాత్మకతకు నిదర్శనమని ప్రశంసించారు. ఇలాంటి రచనలు విద్యార్థుల్లో పఠనాసక్తిని, ఆలోచనా శక్తిని, సృజనాత్మకతను పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం కథల సంపుటి రచయిత్రి జక్కుల లోహితను హరీశ్ రావు ఘనంగా సన్మానించి అభినందించారు. పుస్తక రూపకల్పనలో సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించిన వరుకోలు లక్ష్మయ్యను ప్రత్యేకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి ప్రతిభకు సాహిత్యరూపం దాల్చిన 'పడిలేచిన కెరటం' పుస్తకావిష్కరణ కార్యక్రమం సాహిత్యాభిమానుల్లో ఆనందాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో శ్రీలత, శ్రీనివాస్, సర్పంచ్ నాగేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, పూర్ణచందర్ రావు, వరుకోలు లక్ష్మయ్య తదితరులు పాల్గొని రచయిత్రిని అభినందించారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి సీఎం సిద్దిపేటకు రావాలి

- ఆగిపోయిన అభివృద్ధి పనులు పూర్తి చేసి రావాలి.. రైతులకు క్షమాపణ చెప్పాలి..
- మాజీ మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 07, :

సిద్దిపేటకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నిసార్లు వచ్చినా కొత్తగా చేసేదేమీ లేదని, గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సిద్దిపేటలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ విద్యార్థి విభాగం గ్రామ కమిటీల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, 45 రోజుల్లో రైతుబంధు అమలు చేస్తామని హామీ ఇచ్చి విఫలమయ్యారని ఆరోపించారు. సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలించడం దారుణమన్నారు. ఆగిపోయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేటను విద్య, వైద్యం, సాగునీరు, పరిశ్రమలు, రైల్వే రంగాల్లో అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. కాళేశ్వరం జలాలతో జిల్లాలో సాగు విస్తీర్ణం, వరి దిగుబడులు పెరిగాయని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. విద్యార్థులు చదువుకు ప్రాధాన్యత ఇస్తూనే రాజకీయాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సామాజిక మాధ్యమాల్లో తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిద్దిపేట అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హరీశ్ రావు హామీ ఇచ్చారు.

హుస్నాబాద్ 250 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలి
- నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి



హుస్నాబాద్ ప్రతినిధి, నవంబర్ 07, :

హుస్నాబాద్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న 250 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్మాణ పురోగతిని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రధాన భవనంలోని మొదటి అంతస్తు స్లాబ్ పనులను రెండు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా ఈ ఆసుపత్రి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో 250 పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రామ్మూర్తి, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు ఉన్నారు.

సిద్దిపేట రూరల్ మండల వార్డు సభ్యుల ఫోరం కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- మండల అధ్యక్షురాలిగా కంతుల శిరీష స్వామి ఎన్నిక
- వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడుతా
- కంతుల శిరీష స్వామి



సిద్దిపేట రూరల్, నవంబర్ 07, :

తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ముక్క అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దె రాజు ఆధ్వర్యంలో సిద్దిపేట రూరల్ మండల వార్డు సభ్యుల ఫోరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షురాలిగా కంతుల శిరీష స్వామి, గౌరవ అధ్యక్షులుగా ములుగు యాదగిరి, ఉపాధ్యక్షులుగా గ్యార తారమ్మ శంకర్, దుర్గం రవికుమార్, పోతురాజు స్వామి, ప్రధాన కార్యదర్శులుగా గుర్రం రాజశేఖర్ రెడ్డి, కోటగిరి హరీష్, కార్యదర్శులుగా రేణిగుంట శ్రీనివాస్, గ్యార నీరజ కుమారస్వామి, మన్నే అనురాధ గిరి, గందారం రాజేందర్ ఎన్నికయ్యారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులుగా పొన్నాల లావణ్య, దుర్గం తిరుపతి, జంగు మల్లేశంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షురాలు కంతుల శిరీష స్వామి మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, మండలంలోని ఏ వార్డు సభ్యుడికి ఎలాంటి సమస్య ఎదురైనా అండగా నిలుస్తూ, వారి హక్కుల సాధన కోసం ముందుండి పోరాడుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆనరాశి నాగరాజు, మండల వార్డు సభ్యులు తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారానికి మధ్యవర్తిత్వంపై విస్తృత అవగాహన కల్పించాలి

- వినియోగదారుల సంఘాలకు జస్టిస్ రాధా రాణి సూచన



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 07, :

వినియోగదారుల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు వినియోగదారుల రక్షణ చట్టం–2019లో పొందుపరిచిన మధ్యవర్తిత్వ విధానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ రాధా రాణి సూచించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మధ్యవర్తిత్వం ప్రాధాన్యతపై అవగాహన సదస్సుకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. వినియోగదారుల రక్షణ చట్టం–2019, మధ్యవర్తిత్వ చట్టం–2023 నిబంధనల ప్రకారం వినియోగదారులు తమ సమస్యలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను త్వరగా పరిష్కరించుకోవడంతో పాటు సమయం, ఖర్చు ఆదా అవుతాయని తెలిపారు. గతంలోనూ అనేక సమస్యలు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారమ య్యాయని, భారత న్యాయ వ్యవస్థలో ఈ విధానానికి చట్టబద్ధమైన గుర్తింపు, ప్రాధాన్యత ఉన్నాయని వివరించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణలో సంఘాలు చురుకైన పాత్ర పోషిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

విద్యారంగ సేవలను వినియోగదారుల చట్టం పరిధిలోకి తేవాలి

సదస్సు అనంతరం వినియోగదారుల జాతీయ ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, మొగిలిచర్ల సుదర్శన్, రాష్ట్ర అధ్యక్షురాలు దొంతి శిల్పారెడ్డి, కన్జ్యూమర్ అసోసియేషన్ అధ్యక్షుడు వనం రమేష్ తదితరులు జస్టిస్ రాధా రాణికి వినతిపత్రం సమర్పించారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాలు అందించే విద్యాసేవలను తిరిగి వినియోగదారుల రక్షణ చట్టం పరిధిలోకి తీసుకురావాలని కోరారు. విద్యా, వైద్య రంగాల్లో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, మోసాలపై న్యాయం పొందేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై వినియోగదారుల ప్రతినిధులు రిజిస్ట్రార్, జడ్జి సత్యేంద్రకు కూడా తమ అభిప్రాయాలను తెలియజేశారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా, స్వచ్ఛత, పర్యావరణ హిత దీపావళిపై అవగాహన

- ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వచ్ఛత ప్రోగ్రాం.. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల ర్యాలీ..





సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 07, :

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ సూచనల మేరకు శనివారం 'స్వచ్ఛత కోసం ఒక రోజు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయడంతోపాటు మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వి పచ్చదనం పెంపునకు తమ వంతు కృషి చేశారు.అనంతరం ఎన్‌సీసీ, ఎకో క్లబ్, రసాయన శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో 'పర్యావరణ హిత దీపావళి'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల నుంచి టిహెచ్‌ఆర్ నగర్ వరకు విద్యార్థినులు అవగాహన ర్యాలీ చేపట్టి దీపావళి పండుగ విశిష్టత, పర్యావరణ పరిరక్షణలో పౌరుల బాధ్యతలను ప్రజలకు వివరించారు. అధిక శబ్దం, కాలుష్యానికి కారణమయ్యే బాణసంచాను తగ్గించి పర్యావరణానికి మేలు చేసే విధంగా పండుగను జరుపుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీవన్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్వేత మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ కె స్రవంతి మాట్లాడుతూ కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు టిహెచ్‌ఆర్ నగర్‌లోని ప్రజలకు వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవడం, ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు కిషోర్, వాణిజ్య విభాగాధిపతి హరిప్రసాద్, ఎకో క్లబ్, ఎన్‌సీసీ బాధ్యురాలు డాక్టర్ ఎస్ స్వప్న, తిరుపతి, చారి, కమలాకర్, సంతోష్ కుమార్, ఇందిర, షాజహాన్, కల్పన, తిరుపతి, లింగమూర్తి, ఇలియాస్, అయోధ్య, సత్యనారాయణ, శ్రీకాంత్‌తో పాటు కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సువర్ణదేవి కృతజ్ఞతలు తెలిపారు.

వడ్ల కొనుగోళ్లలో జాప్యం చేస్తే కఠిన చర్యలు

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేపట్టాలి
- కొనుగోలు కేంద్రాల్లో ఎల్‌నినో విపత్తుపై రైతులకు అవగాహన
- ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్



చిన్నకోడూరు, నవంబర్ 07, :

రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ అధికారులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.చిన్నకోడూరు మండల పరిధిలోని గోనేపల్లి, పెద్దకోడూరు, చిన్నకోడూరు, రామంచ, గంగాపూర్, విఠలాపూర్, రంగయ్యపల్లి, ఎల్లయ్యపల్లి, మాచాపూర్, ఇబ్రహింనగర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీసం మహేందర్ యాదవ్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా అందరికీ సమాన ప్రాధాన్యతనిస్తూ వరుస క్రమంలో సేవలు అందించాలని సూచించారు. ధాన్యం తూకంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా కొనసాగించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ పరిస్థితులు, సంభవించే విపత్తులపై కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు పాకాల భూపతిరెడ్డి, మహమ్మద్ సలీం, నమూస్ల వినోద్, బాలలక్ష్మి , అశోక్, అనుపాటి విజయ్ కుమార్, మహిపాల్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, నాగరాజు యాదవ్, తాళ్లపల్లి రాజు, మండల సీనియర్ నాయకులు పొన్నాల రాజేష్, గొట్టిపర్తి చందు, కొమ్ము ప్రశాంత్, గోపు హరిబాబు, పంతం శ్రీనివాస్, కొమ్ము ఎల్లయ్య, కొమ్ము రాజు, మహేందర్ రెడ్డి, ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి, సీసీలు వైకుంఠం, రాజ్ కుమార్, కొమురయ్య, సీఏలు, వీఓఏలు, గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, రైతులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శేఖర్ రావుపేట ప్రజల ప్రేమాభిమానాలు మరువలేనివి

- ఊరు చిన్నదైనా.. మనసులు పెద్దవి..
- కేసీఆర్‌పై మీకున్న అభిమానంతో గ్రామానికి ఆయన పేరు పెట్టుకున్నారు
- మీ ప్రేమను గుండెల్లో పెట్టుకుంటా
- వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తాం..
- మాజీ మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 07, :

శేఖర్ రావు పేట గ్రామ ప్రజల ప్రేమాభిమానాలు మరువలేనివని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. శనివారం నారాయణరావుపేట మండలంలోని శేఖర్ రావు పేట గ్రామంలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ ఒకప్పుడు జిల్లగడ్డ, మునిగెల గడ్డ పేర్లతో పిలిచే ఈ గ్రామానికి కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో శేఖర్ రావు పేటగా పేరు పెట్టుకోవడం ఎంతో గొప్ప విషయమన్నారు. కేసీఆర్ అంటేనే నమ్మకానికి ప్రతీక అని, ఆయనపై గ్రామ ప్రజలకు ఉన్న ప్రేమ, అభిమానం వెలకట్ట లేనివని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాతిండ్ల గ్రామం నుంచి విడిపోయి శేఖర్ రావు పేట ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పడాలని గ్రామ ప్రజలు కోరగానే కేసీఆర్ వెంటనే ఆమోదం తెలిపారని గుర్తుచేశారు. గ్రామపంచాయతీగా ఏర్పడక ముందే గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. రూ.60 లక్షలతో మాతిండ్ల నుంచి ఇబ్రహీంపూర్ వరకు బీటీ రోడ్డు, రూ.23 లక్షలతో ఫంక్షన్ హాల్, రూ.12 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం, రూ.10 లక్షలతో పెద్దమ్మ దేవాలయం, రూ.60 లక్షలతో సీసీ రోడ్లు, రూ.5 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వీటితో పాటు గ్రామంలో బోరు మోటారు, హనుమాన్ ఆలయానికి ఆర్థిక సహాయం, రోడ్లు, కల్వర్టులు, 60 వేల లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. యువత కోరిక మేరకు ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష అందించినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ, అభిమానం, ఆప్యాయతను ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటానని హరీశ్ రావు అన్నారు. బాల వికాస సంస్థ ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధి కేంద్రాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ నాయకత్వంలో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని హరీశ్ రావు పేర్కొన్నారు.

కొత్త ప్రభాకర్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు చెరుకు శ్రీనివాస్ రెడ్డికి లేదు

మూడు సార్లు పోటీ చేసినా డిపాజిట్లు దక్కలేదు

బీఆర్ఎస్ నేతల ఘాటు వ్యాఖ్యలు



దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 07, :

ప్రజల మద్దతుతో గెలుపొందిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై విమర్శలు చేసే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డికి లేదని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి రాజకీయ విమర్శలకే పరిమితమవడం సరికాదని హితవు పలికారు. శనివారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎన్నికల బరిలో నిలిచినా కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేని చెరుకు శ్రీనివాస్ రెడ్డి, ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదం అన్నారు. నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ చిత్తశుద్ధితో పనిచేస్తున్న నాయకుడు కొత్త ప్రభాకర్ రెడ్డి అని పేర్కొన్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డిపై ప్రజలకు ఉన్న ఆదరణను రాజకీయ విమర్శలతో తగ్గించలేరని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా విమర్శలకే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోందని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిని ఉద్దేశపూర్వకంగా విమర్శిస్తే సహించేది లేదని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

జిల్లా స్థాయి పదవికి గడ్డం స్వామి ఎన్నిక

- పద్మశాలి సంఘం ఘన సన్మానం
- మిరుదొడ్డి పద్మశాలి సమాజానికి గర్వకారణం: సంఘం సభ్యులు



దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), నవంబర్ 07, :

గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎదిగి పద్మశాలి సమాజానికి గుర్తింపు తీసుకురావడం గర్వకారణమని మిరుదొడ్డి పద్మశాలి సంఘం సభ్యులు అన్నారు. సిద్దిపేట జిల్లా టిడబ్ల్యూజేఎఫ్ సహాయ కార్యదర్శిగా బతుకమ్మ టీవీ రిపోర్టర్‌గా పనిచేస్తున్న మిరుదొడ్డి గ్రామానికి చెందిన గడ్డం స్వామి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ పద్మశాలి సమాజానికి చెందిన వ్యక్తి జర్నలిజం రంగంలో రాణిస్తూ జిల్లా స్థాయి బాధ్యతలు చేపట్టడం ఎంతో సంతోషకరమన్నారు. గడ్డం స్వామి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా పద్మశాలి సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ఐకమత్యంతో అంచెలంచెలుగా ఎదగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షులు గడ్డం స్వామి, సుతారి రమేష్, ప్రధాన కార్యదర్శి గడ్డం ఆంజనేయులు, కోశాధికారి గడ్డం శ్రీనివాస్, ముఖ్య సలహాదారు గడ్డం విట్టల్, సలహాదారులు రాపల్లి రాజేశం, గడ్డం మహదేవ్, సంఘ సభ్యులు రాపల్లి నర్సింలు, సుతారి కిష్టయ్య, పెద్ది అశోక్, కొండ శ్రీనివాస్, బట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కాంగ్రెస్ జేఏసీ నాయకుల భేటీ

సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన మంత్రి



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 07, :

కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ జేఏసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శనివారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెలకొన్న వివిధ ప్రజా సమస్యలు, స్థానిక అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మంత్రితో చర్చించారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో సాధు ప్రతాప్ రెడ్డి, పట్లోళ్ల నాగిరెడ్డి, శేరి సతీష్ రెడ్డి, సంజీవరావు, మేకల మైఖేల్, కొండల్ రెడ్డి, ఇసుక శ్రీనివాస్ రెడ్డి, తమ్మినేని ప్రవీణ్ కుమార్, పెసరి విట్టల్ రెడ్డి, సుంకన్న, పన్నాల రాజశేఖర్ రెడ్డి, మొయిజ్ తదితరులు పాల్గొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని కాంగ్రెస్ పార్టీ జేఏసీ నాయకులు పేర్కొన్నారు.

దుబ్బాక అభివృద్ధిపై ఎమ్మెల్యే నిర్లక్ష్యం

- పెద్ద చెరువు పనులు చేపట్టకపోవడంపై కాంగ్రెస్ నేత మచ్చ శ్రీనివాస్ విమర్శలు

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 07, :

దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి పనుల విషయంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన కీలక పనులను పట్టించుకోకుండా ప్రాంతంపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. శనివారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దుబ్బాక పెద్ద చెరువు అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ పనులు ప్రారంభించకపోవడంపై ప్రశ్నించారు. ఈ అంశంపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి స్పందించకపోవడం ఏమిటని నిలదీశారు. దుబ్బాక నియోజకవర్గంలో ఓటుకు నోట్లు పంచుతూ రాజకీయాలను కలుషితం చేశారని ఎమ్మెల్యేపై ఆరోపణలు చేశారు. తాను ఎలాంటి ఓటుకు నోట్లు పంచలేదని చెప్పే ధైర్యం ఉంటే పోతారం రామాలయంలో పసుపు నీళ్లతో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. లేదంటే తాను దుబ్బాక పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని మచ్చ శ్రీనివాస్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామచంద్రరెడ్డి, సాయి, కౌన్సిలర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ ఫ్లాగ్ డే పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు, పోలీస్ సిబ్బంది





- విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసిన సీపీ సాధన రష్మీ పెరుమాళ్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 07, :

పోలీస్ ఫ్లాగ్ డే-2026 వేడుకల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, లఘుచిత్రాల నిర్మాణం, ఫోటోగ్రఫీ పోటీల్లో విద్యార్థులు, యువత, పోలీస్ సిబ్బంది తమ ప్రతిభను చాటుకున్నారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి శనివారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో యువతతో పాటు పోలీస్ సిబ్బంది ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను, ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారని కొనియా డారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొం దించడంతో పాటు పోలీస్ శాఖ సేవలు, త్యాగాలు, బాధ్యతలపై సమాజంలో అవగాహన కల్పించేందుకు దోహదపడ తాయని పేర్కొన్నారు.

పోటీల విజేతలు వీరే.. పాఠశాల విద్యార్థుల విభాగం (12వ తరగతి వరకు)

ప్రథమ బహుమతి బి భావన (10వ తరగతి, శ్రీ విద్యానికేతన్ హైస్కూల్, బెజ్జంకి), ద్వితీయ బహుమతి బి దివిజ (8వ తరగతి, తెలంగాణ మోడల్ స్కూల్, దౌల్తాబాద్), తృతీయ బహుమతి ఆదిత్య (10వ తరగతి, శ్రీ విద్యానికేతన్ హైస్కూల్, బెజ్జంకి) సాధించారు.

పోలీస్ కానిస్టేబుల్ విభాగం

ప్రథమ బహుమతి చిరంజీవి (అక్కన్నపేట పోలీస్ స్టేషన్), ద్వితీయ బహుమతి రవళిక (బెజ్జంకి పోలీస్ స్టేషన్), తృతీయ బహుమతి దివ్య (సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్, సిద్దిపేట) అందుకున్నారు.

ఎస్ఐ, ఆపై స్థాయి అధికారుల విభాగం

రోహిత్, అభిలాష్ (ఇద్దరూ ఆర్ఎస్ఐలు, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్, సిద్దిపేట) ప్రతిభ కనబరిచారు.

లఘుచిత్రాల పోటీల్లో

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా వీడియో రూపొందించిన సాయి ప్రసాద్ ప్రథమ బహుమతి సాధించగా, పోలీసుల త్యాగాలు, కఠిన విధి నిర్వహణను వివరిస్తూ వీడియో రూపొందించిన ఇ. వీరప్ప ద్వితీయ బహుమతి పొందారు.

ఫోటోగ్రఫీ విభాగంలో

సాక్షి ఫోటోగ్రాఫర్ సతీష్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, ఇన్‌స్పెక్టర్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ టెక్నో హైస్కూల్‌లో అంబరాన్నంటిన దీపావళి సంబరాలు

- ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 07, :

స్థానిక సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ టెక్నో హైస్కూల్‌లో శనివారం దీపావళి పండుగ సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం దీపాల వెలుగులు, పూల అలంకరణలు, చిన్నారుల సందడితో పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు బంతి, చామంతి పూలతో పాఠశాల ఆవరణను అందంగా అలంకరించి తమ సృజనాత్మకతను చాటుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి దీపాలు వెలిగిస్తూ, కాకర వత్తులు, చిచ్చుబుడ్లతో దీపావళి వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ కేవలం దీపాలు వెలిగించే పండుగ మాత్రమే కాదని, మనలోని అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగులను నింపే గొప్ప సందేశాన్ని అందించే పండుగ అని పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను దేశవ్యాప్తంగా ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకుంటారని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో దీపావళి వెలుగులు కొత్త ఆశలను, సంతోషాలను నింపాలని, ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. చిన్నారుల్లో పండుగల పట్ల అవగాహనతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల



గౌరవభావం పెంపొందించడం అభినందనీయ మని పేర్కొంటూ విద్యార్థినీ, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

రైతులకు మద్దతు ధర అందించడమే లక్ష్యం



- దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 07, :

దుబ్బాక మండలం రాజక్కపేట, చికోడు, గంభీర్ పూర్ , బల్వంతపూర్, పద్మశాలి గడ్డ, నర్లేన్ గడ్డ, హసన్ మిరాపూర్ గ్రామలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగర రవి, ఏపీఎం రామకృష్ణ, సీసీలు ఏఈఓలతో కలసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికే కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని అన్నారు.రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందేలా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ధాన్యం తూకం, నాణ్యత పరిశీలన, కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన పేర్కొన్నారు. వరి కోతలు పూర్తయిన వెంటనే రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొంగరం బాల్ రెడ్డి, డైరెక్టర్లు కడదురి నరేందర్ రెడ్డి, మట్ట కిషన్ రెడ్డి, పర్స నర్సింలు, ఎండి అజీజు ఆయా గ్రామాల సర్పంచ్లు పలువురు పాల్గొన్నారు.

తుఫాన్‌తో దెబ్బతిన్న చెరువులకు శాశ్వత మరమ్మతులు

- దమ్మపేట మండలంలో నాలుగు చెరువుల పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే జారె

దమ్మపేట, నవంబర్ 07, :

మురసు తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని పలు చెరువులకు గండ్లు పడటంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేసింది. రైతులకు సాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎఫ్‌డీఆర్ నిధుల కింద ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ఈ నేపథ్యంలో దమ్మపేట మండలంలోని నాలుగు చెరువుల మరమ్మతు పనులను శనివారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగుపల్లి గ్రామంలోని ముసలి బంధం చెరువు శాశ్వత మరమ్మతులకు రూ.49.80 లక్షలు, దమ్మపేటలోని పేరంటాల చెరువుకు రూ.47 లక్షలు,



రాంజీకుంట మరమ్మతులకు రూ.8.50 లక్షలు, ఆసన్నగూడెంలోని రంగన్న కుంటకు రూ.39.50 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. ఈ నాలుగు చెరువులకు కలిపి మొత్తం రూ.1.448 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న చెరువులకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు లకు అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల తరపున ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డి.ఈ కృష్ణ, అధికారులు, సర్పంచ్ పగడాల రమాదేవి, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, రూపా రాంబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కక్కిరాల రమేష్, చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, జల్లిపల్లి దేవరాజు, శ్రీరాముల ప్రసాద్, వనమాల శ్రీనివాసరావు, రొయ్యల కుమార్, పిట్టల శ్రీనివాసరావు, గట్ల నాగరాజు, కొయ్యల ప్రసాద్, అన్నవరపు నాగేంద్రరావు, షేక్ ఇస్మాయిల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుల పోలె శ్రీకాంత్ చేతుల మీదగా చీరల పంపిణీ

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 07, :

సుభాష్ నగర్ డివిజన్ లోని సుభాష్ నగర్ కి చెందిన పారిశుద్ధ్య కార్మికులకు శనివారం బొల్లా రామకృష్ణ ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పోలె శ్రీకాంత్ పాల్గొని వారి చేతుల మీదగా పరిశుద్ధ కార్మికులకు చీరల పంపిణి చేశారు. మన బస్తీలలో రోజూ నిస్వార్థంగా సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి చీరలు పంపిణీ చేసిన రామకృష్ణని అభినదించారు. అలాగే చీకట్లో నుంచి వెలుగులోకి పరిశుద్ధ కార్మికుల జీవితాలు రావాలని, అందరు సుఖసంతోషాలతో దీపావలి పండగ జరుపుకోవాలని వారికి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రవీణ్, సుబ్బారామయ్య, దుర్గా రావు, ఎస్వీ కార్పొరేటివ్ సొసైటీ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.



దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

- వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గొడ్డుబర్ల భాస్కర్ డిమాండ్

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 07, :

వర్షాభావ పరిస్థితులతో పంటలు దెబ్బతిని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ఆదుకునేందుకు దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని మండలాలను వెంటనే కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గొడ్డుబర్ల భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతుల పంట చేతికి వచ్చిన సమయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం వల్ల అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని కోరారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల, పట్టణ కమిటీల సమావేశం పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం ఇప్పటికే వెనుకబడిన ప్రాంతంగా ఉందని, ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరుబావులు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పంటల దిగుబడులు తగ్గి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యవసాయంతో పాటు గ్రామాల్లో తాగునీటి సమస్యలు కూడా తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ నెలకొన్న కరువు పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని కోరారు. సిద్దిపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 20న సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పార్టీ శ్రేణులు, ప్రజలు ఈ పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దుబ్బాక మండలం, మున్సిపల్ పరిధిలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాల్సిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతులు ధాన్యాన్ని నేరుగా రైస్ మిల్లులకు విక్రయిస్తుండటంతో మిల్లుల యజమానులు తూకాల్లో కోతలు విధిస్తూ నష్టపరుస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే ముందు పూర్తిస్థాయిలో ఆరబెట్టాలని అధికారులు నిబంధనల



పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. అకాల వర్షాలు కురిస్తే రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లులను కేటాయించి ధాన్యం సేకరణ ప్రారంభించాలని, కొనుగోలు సమయంలో తూకాల్లో ఎలాంటి కోతలు విధించకుండా రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి నవీన్, పట్టణ కార్యదర్శి కొంపల్లి భాస్కర్, నాయకులు ఎండీ సాదిక్, ఎండీ సాజిద్, మెరుగు రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

- ఓటరు జాబితాలో పేరు లేని వారికి మరో అవకాశం
- నవంబర్ 21 వరకు ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణ
- జిల్లా కలెక్టర్లకు సూచించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 07, :

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్-2026) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన వారికి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సర్-2026 ప్రక్రియ, ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ, ఓటరు జాబితాలో పేర్ల నమోదు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ గైర్హాజరు, చిరునామా మార్పు, మరణం తదితర కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన ఓటర్లు మరోసారి తమ ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలను నవంబర్ 21వ తేదీ వరకు సమర్పించేందుకు అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని వెల్లడించారు. అదేవిధంగా గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన ఓటర్ల వివరాలను పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాల రూపంలో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లు తమ పాత ఎపిక్ నంబర్ ఆధారంగా ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ లేదా ఈసీఐనెట్ యాప్ ద్వారా కూడా ఎన్యుమరేషన్ ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని సమర్పించవచ్చని తెలిపారు.అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు అందేలా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు.

ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్

- భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, ఇతర సాంకేతిక అంశాల పరిశీలన

జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 07, :

ఎన్నికల సంఘం ఆదేశానుసారం సాధారణ తనిఖీ లో భాగంగ ధరూర్ క్యాంప్‌లోని ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు) గోదామును జగిత్యాల జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్యప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా గోదాములో భద్రపరిచిన ఈవీఎం యంత్రాల భద్రత, గోదాము వద్ద చేపట్టిన రక్షణ ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, ఇతర సాంకేతిక అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. గోదాము పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతున్న తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గోదాము వద్ద ఏర్పాటు చేసిన భద్రతా వ్యవస్థ నిరంతరం పనిచేసేలా చూడాలని, సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, ఎలక్షన్ సూపరిండెంట్ జ్యోతి, జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం.. అకాల వర్షా లతో రైతులకు కన్నీళ్లే..

- 25 లక్షల ఎకరాల్లో ఎండిన పంటలు.. తడిసిన ధాన్యం..
- రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- సిద్దిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 07, :

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం, అకాల వర్షాలతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, మార్కెట్ యార్డుల్లో నెలకొన్న దుస్థితిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత తన్నీరు హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సిద్దిపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో కరువు పరిస్థితుల కారణంగా దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని హరీశ్ రావు అన్నారు. మిగిలిన పంటనైనా అమ్ముకుందామంటే ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో, ముఖ్యంగా దొడ్డు వడ్లు పండించిన రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, సిద్దిపేట, మెదక్ తదితర జిల్లాల్లో కురుస్తున్న అకాల వర్షాలకు కల్లాలు, కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లో ఆరబోసిన ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కొనుగోలు కేంద్రాలకు ఇప్పటివరకు ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు, కప్పడానికి అవసరమైన పట్టాలు, తేమను కొలిచే పరికరాలు చేరలేదని ఆరోపించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు రవాణా ఏర్పాట్లు, ఏ గ్రామం ధాన్యాన్ని ఏ మిల్లుకు పంపించాలనే కేటాయింపులు కూడా పూర్తికాలేదని విమర్శించారు. సన్న వడ్లను ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నప్పటికీ దొడ్డు వడ్లు పండించిన రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.రెండు ఎకరాల్లో వరి సాగు చేసిన రైతుకు కరువు కారణంగా ఒక ఎకరం పంట ఎండిపోగా, మిగిలిన ఎకరంలో పండిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలకు తడిసి తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రవాణా ఏర్పాట్లు, మిల్లుల కేటాయింపులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ, పౌరసరఫరాలు, గ్రామీణాభివృద్ధి, సహకార శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కోరారు.

పంట నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించాలి

రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినట్లు ప్రభుత్వమే చెబుతున్నప్పటికీ, ఇప్పటివరకు పంట నష్టం అంచనాలు ప్రారంభించక పోవడం దారుణమని హరీశ్ రావు విమర్శించారు. ఏ జిల్లా, ఏ మండలం, ఏ గ్రామంలో ఎంతమంది రైతులు ఎంత మేర నష్టపోయారనే వివరాలను సేకరించాలని కోరారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పంట నష్టపోయిన రైతులకు పెట్టుబడి సాయంగా ఆర్థిక సహాయం అందించాయని పేర్కొంటూ, తెలంగాణ ప్రభుత్వం కూడా వెంటనే నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

మార్కెట్ యార్డుల్లో కనీస సౌకర్యాలు కరువు

మార్కెట్ యార్డుల సొంత ఆదాయ నిధులను సైతం



ఆర్థిక శాఖ నిలిపివేయడం వల్ల రైతులకు కనీస సౌకర్యాలు కల్పించలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. రెండేళ్లుగా బిల్లులు చెల్లించకపోవడంతో మరమ్మతులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. మార్కెట్ యార్డుల్లో షెడ్ల పైకప్పులు లీకవుతున్నా మరమ్మతులు చేయడం లేదని, విద్యుత్ దీపాలు, గాలిమరలు పనిచేయడం లేదని పేర్కొన్నారు. రైతులకు తాగునీరు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, భోజన వసతి వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో మార్కెటింగ్ శాఖ విఫలమైందని విమర్శించారు. మార్కెటింగ్ శాఖలో అనేక కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇన్‌ఛార్జి పాలన కొనసాగుతోందని అన్నారు. సిద్దిపేటలోనే మార్కెట్ కార్యదర్శి, జిల్లా మార్కెటింగ్ అధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఒక్కో అధికారి నాలుగు జిల్లాలు, 20 మార్కెట్ యార్డుల బాధ్యతలు నిర్వహిస్తే రైతుల సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి, ప్రతి జిల్లాకు, ప్రతి మార్కెట్ యార్డుకు పూర్తిస్థాయి అధికారులను నియమించాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రిని డిమాండ్ చేశారు.

వెలమ కార్పొరేషన్ తొలి చైర్మన్‌గా జువ్వాడి బాధ్యతల స్వీకారం



- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 07, :,

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెలమ కార్పొరేషన్ తొలి చైర్మన్‌గా జువ్వాడి నర్సింగరావు శనివారం హైదరాబాద్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. మైత్రి వనం హెచ్ఎండీఏ రెండో అంతస్తులో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ జువ్వాడి నర్సింగరావుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హకీంపేటలోని జూపల్లి బాలమ్మ వెలమ కన్వెన్షన్ లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో కూడా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు కుమారుడైన నర్సింగరావు కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా పార్టీ బలోపేతానికి చేసిన కృషి, అంకితభావానికి గుర్తింపుగా వెలమ కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించిందని ఎమ్మెల్యే కవ్వంపల్లి పేర్కొన్నారు. నూతన బాధ్యతల్లో నర్సింగరావు విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

దీపావళి వేడుకల్లో సీఎం రేవంత్ జన్మదిన సంబరాలు జరపాలి

- ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లల్లోనూ వెలుగులు నింపాలి
- కాంగ్రెస్ శ్రేణులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పిలుపు



మానకొండూర్ ప్రతినిధి, నవంబర్ 07, :

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినంతో పాటు దీపావళి పర్వదిన వేడుకలను ఆదివారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించాలని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను దీపావళి పండుగ సందర్భంగా ప్రతి మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. మానకొండూరు నియోజకవర్గ పరిధిలోని మానకొండూరు, శంకరపట్నం, తిమ్మాపూర్, గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేడుకల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, పీఏసీఎస్ పాలకవర్గాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సమన్వయం చేసుకోవాలని డాక్టర్ కవ్వంపల్లి సూచించారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లల్లోనూ వెలుగులు నింపాలి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దీపావళి పండుగను పురస్కరించుకొని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి వారి ఇళ్లలో దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు.ఇదే స్ఫూర్తితో మానకొండూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు,ఏఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, ముఖ్య నాయకులు ప్రతి ఒక్కరూ తమ తమ గ్రామాల్లో ఒక ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుని ఎంపిక చేసుకొని, వారి కుటుంబంతో కలిసి వారి ఇంట్లో దీపావళి పండుగను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కోరారు.

వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడికి ఎమ్మెల్యే సంజయ్ శుభాకాంక్షలు

హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 07, :

మొట్టమొదటి వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ్ రావు శనివారం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా జూపల్లి బాలమ్మ వెలమ కన్వెన్షన్, హకీంపేట్ లో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా జువ్వాడి నర్సింగ రావుని కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. అంతకుముందు మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జువ్వాడి రత్నాకర్ రావు కుటుంబం తో నాకు మొదటి నుంచి మంచి అనుబంధం ఉందని, వారు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి, ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, మాజీ రాజ్య సభ సభ్యులు కెవిపి రామచందర్ రావు, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, జువ్వాడి కృష్ణ రావులతో కలిసి పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్.



ప్రభుత్వ స్థలాల వేలంపై జనసేన నిరసన ర్యాలీ

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 07 :

కేపీహెచ్‌బీ కాలనీలో ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ స్థలాల వేలం పాటలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జాయింట్ కమిటీ కన్వీనర్, కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ నాయకత్వంలో శనివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రజా అవసరాలకు వినియోగించాల్సిన ప్రభుత్వ స్థలాలను వేలం వేయడాన్ని నిరసిస్తూ జనసేన నాయకులు, కార్యకర్తలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజల అవసరాల కోసం కేటాయించిన ఫిష్ మార్కెట్ పక్కన ఉన్న స్థలం, ట్రక్ పార్కింగ్ స్థలంతో పాటు పబ్లిక్ పార్కులు, ఆసుపత్రులు, పాఠశాలలు, పెట్రోల్ బంకుల వంటి ప్రజోపయోగ అవసరాలకు వినియోగించాల్సిన స్థలాలను ప్రభుత్వం వేలం పేరుతో విక్రయించడం సరికాదన్నారు. ప్రజా ఆస్తులను కాపాడటమే తమ లక్ష్యమని, వేలం ప్రక్రియను రద్దు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వేలం పాటల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాలనీవాసులు, కాలనీ సంక్షేమ సంఘాలతో కలిసి వేలం ప్రక్రియను అడ్డుకుంటామని, ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన ర్యాలీలో కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, బోగాది వెంకటేశ్వర్ రావు, నాగేంద్ర, పండుగ



సూర్య, అశోక్ మాదాసు, డి వెంకట్, శ్రీనివాస్ గోవింద్, అంజి, పవన్, ప్రసన్న ఆంజనేయులు, సుదర్శన్, రాము, ప్రసాద్ నాయుడు, మురళి, ప్రసాద్, శివశంకర్, శేఖర్, గోపి, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

- బాపూజీ ఉన్నత పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ నవ్వా ప్రభాకర్ రావు
- విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య దీపావళి సంబరాలు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి (జగద్గిరిగుట్ట), నవంబర్ 07, :

దివ్యమైన దీపావళి పండగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని బాపూజీ ఉన్నత పాఠశాల చైర్మన్ కరస్పాండెంట్ నవ్వా ప్రభాకర్ రావు అన్నారు. దీపావళి పర్వదినం పురస్కరించుకొని జగద్గిరిగుట్ట సమీపంలోని వెంకటేశ్వరనగర్ లోగల బాపూజీ పాఠశాలలో శనివారం దీపావళి వేడుకలు విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం రంగురంగుల అలంకరణలు, దీపాలు, విద్యుత్ కాంతులతో అందంగా ముస్తాబు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పండుగ వాతావరణాన్ని మరింత శోభాయమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవ్వా ప్రభాకర్ రావు మాట్లాడుతూ విద్యార్థులకు దీపావళి పండుగ యొక్క విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గురించి ఉపాధ్యాయులు వివరించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి దీపావళి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తమ పాఠశాలలో ప్రతి పండుగ విశిష్టత తెలియజేసేలా పలు కార్యక్రమాలు ద్వారా విద్యార్థుల్లో ఐకమత్యం, సోదరభావం, పరస్పర గౌరవం, ప్రేమానురాగాలు సామాజిక బాధ్యత వంటి విలువలు పెంపొందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నామన్నారు. పర్యావరణ పరిరక్షణపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవడంతో పాటు పర్యావరణానికి హాని కలిగించని విధంగా, శబ్ద వాయు కాలుష్యాన్ని తగ్గిస్తూ సురక్షితమైన పద్ధతుల్లో పండుగను జరుపుకోవాలని సూచించారు. మట్టి ప్రమిదలు వెలిగించడం, ఇతరులకు సహాయం చేయడం, పేదలకు ఆనందాన్ని పంచడం వంటి మంచి అలవాట్లను విద్యార్థులు అలవరచుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు సిబ్బంది బాణసంచా కాల్చుకుంటూ వేడుకలు జరుపుకున్నారు. దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

దొమ్మట మీదుగా జేబీఎస్ కు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని డీఎంకు వినతి



దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 07, :

దౌల్తాబాద్ మండలంలోని దొమ్మట, తిర్మలాపూర్ గ్రామాల మీదుగా దుబ్బాక నుంచి జేబీఎస్ జూబ్లీ బస్ స్టేషన్ వరకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు డీఎంకి వినతిపత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బస్సు సర్వీసులు ప్రారంభించాలని కోరారు. ఈ సందర్భంగా దుబ్బాక నుంచి ఉదయం 5:00 గంటలకు మొదటి బస్సు బయలుదేరి దొమ్మట గ్రామానికి ఉదయం 6:30 గంటలకు చేరుకునేలా, రెండవ బస్సు దొమ్మాటకు ఉదయం 9:30 గంటలకు చేరుకొని జేబీఎస్‌కు ఉదయం 11:30 గంటలకు చేరుకునేలా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ బస్సు సర్వీసులు ప్రారంభిస్తే దొమ్మాట, తిర్మలాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రజల ప్రయాణ సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు సానుకూలంగా స్పందించి త్వరితగతిన బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి సిద్ధిని రాజమల్లయ్య , రాష్ట్ర ఉపాధ్యక్షులు బలిగారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుడ్డోజి కవిత అకాల మరణం బాధాకరం

భౌతికకాయానికి నివాళులర్పించిన జీడిపల్లి రాంరెడ్డి



దుబ్బాక ప్రతినిధి (తొగుట), నవంబర్ 07, :

తొగుట మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ గుడ్డోజి కవిత (40) అకాల మరణం పట్ల బీఆర్ఎస్ తొగుట మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చందాపూర్ లో పార్టీ శ్రేణులతో కలిసి శనివారం కవిత భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గత నాలుగైదు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కవిత కోలుకొని తిరిగి వస్తుందని ఆశించామని, కానీ ఇంతలోనే అకాల మరణం చెందడం బాధాకరమని అన్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో గ్రామ సర్పంచ్ లు చంద లావణ్య స్వామి, బక్క కనకయ్య, నాయకులు చిలువేరి మల్లారెడ్డి, బండారు స్వామి గౌడ్, సిరిసిల్ల భాస్కర్, నర్సెట్టి మల్లేశం, కృష్ణ, వెంకటయ్య తదితరులున్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి ఆదేశం



హుస్నాబాద్ ప్రతినిధి, నవంబర్ 07, :

హుస్నాబాద్ నియోజకవర్గంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి అధికారులను ఆదేశించారు. శనివారం హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఆర్డీఓ రామ్మూర్తితో కలిసి ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వచ్చే వేసవిలో పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నీటిపారుదల శాఖ అధికారులు నీరు అందుబాటులో ఉన్న చెరువులు, కుంటల శిఖం భూములను గుర్తించి, ఒక్కో చెరువు పరిధిలో 5 నుంచి 10 ఎకరాల్లో పశుగ్రాసం సాగు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా కూడా గడ్డి పెంపకానికి చర్యలు తీసుకోవాలన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు 50 శాతం పూర్తయ్యాయని, నాలుగు అకడమిక్ బ్లాక్‌లు పూర్తయ్యాయని తెలిపారు. వంటగది, భోజనశాల, వసతి గృహాల పనులు కొనసాగుతున్నాయని, వెయిటింగ్ హాల్, క్రీడా మైదానాల పనులు కూడా చేపట్టి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని టీజీ ఈడబ్ల్యూఐడీసీ అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్ కళాశాల అకడమిక్ బ్లాక్‌తో పాటు బాలుర, బాలికల వసతి గృహాల నిర్మాణాలను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. హుస్నాబాద్ పట్టణంలో నిర్మిస్తున్న 250 పడకల ఆసుపత్రి పనులు నెమ్మదిగా సాగడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో వేగం పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని టీజీ ఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. హుస్నాబాద్ నుంచి కొత్తపల్లి వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, చెట్ల తొలగింపు ప్రక్రియను సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి చేసి రోడ్డు పనులు ప్రారంభించాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేపడుతున్న సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, ఆరోగ్య ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ మరుగుదొడ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరమ్మతులు, ప్రహరీ గోడలు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర నిర్మాణ పనులను సమీక్షించారు. ప్రారంభమైన పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు ఇంకా ప్రారంభం కాని పనులను వెంటనే మొదలుపెట్టాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ కాంట్రాక్టర్ల ద్వారా వేగంగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో జలసిరి కార్యక్రమం కింద వీబీజీ రామ్‌జీ పథకంలో చేపడుతున్న ఫామ్ పాండ్లు, బోరుబావుల పునరుద్ధరణ గుంతలు, మ్యాజిక్ సోక్ పిట్లు, వర్షపు నీటి నిల్వ కోసం పైకప్పులపై నీటి సేకరణ పనులను సమీక్షించారు. ఆయా మండలాలకు కేటాయించిన లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో జంక్షన్ల అభివృద్ధి, ఎల్లమ్మ చెరువుకు వెళ్లే రహదారి నిర్మాణం, తోరణాలు, పట్టణ సుందరీకరణతో పాటు ఇతర అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గౌరవెల్లి రిజర్వాయర్ కాలువల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూసేకరణ పూర్తయిన భూములను స్వాధీనం చేసుకుని నీటిపారుదల శాఖకు అప్పగించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కాలువల నిర్మాణ పనులు ప్రారంభమయ్యే వరకు రైతులు ఆ భూముల్లో పంటలు సాగు చేయకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్ అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధి పనులను కూడా సమీక్షించిన కలెక్టర్, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత కాలవ్యవధిలోగా పనులు పూర్తి చేయాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావులేకుండా, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి స్పష్టం చేశారు.



130 మంది బాధిత కుటుంబాలకు రూ.31 లక్షల 59 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- పేదల వైద్య చికిత్సకు సీఎం సహాయ నిధి అండ
- పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 07, :

శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని అత్యవసర వైద్య చికిత్స పొందుతున్న 130 మంది బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 31 లక్షల 59 వేల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను పీఏసీ చైర్మన్, ఆరెకపూడి గాంధీ శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి ఆయన బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 130 మంది బాధిత కుటుంబాలకు రూ.31 లక్షల 59 వేలు ఆర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప వరమని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ, ఆర్థిక స్థోమత లేక వైద్య చికిత్స పొందలేని నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా కల్పిస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని గాంధీ తెలిపారు. ఈ సందర్భంగా వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారబోయిన రాజు యాదవ్, కోనేరు ప్రసాద్, మరేళ్ల శ్రీనివాస్, పోతుల రాజేందర్, ఎండీ ఇబ్రహీం, యెల్లం నాయుడు, కావూరి అనిల్, మంజుల, లక్ష్మమ్మ, లక్ష్మీ అఫ్రఖ్, సల్లావుద్దిన్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమార్కులూ మా జోలికొస్తే ఖబర్దార్

- మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ విభాగం ఛైర్మెన్ కావలి చంద్రయ్య

కుత్బుల్లాపూర్ ప్రతినిధి (జగద్గిరిగుట్ట), నవంబర్ 07, :

ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా కబ్జాలు చేస్తూ గుండాల వ్యవహరిస్తున్న అక్రమార్కుల్లారా.. మా జోలికొస్తే ఖబర్దార్ అని మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ కావలి చంద్రయ్య భూకబ్జాదారులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం సాయంత్రం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి భూదేవి హిల్స్ లోని పరికిచెరువు ఫెన్సింగ్ ప్రాంగణంలో కాంగ్రెస్ నాయకుల, కార్యకర్తలతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాలకృష్ణ అనే వ్యక్తి గత కొన్నేళ్లుగా భూదేవి హిల్స్, పరికి చెరువు కొంత ప్రాంతాన్ని చదును చేసి అక్రమాలకు పాల్పడుతూ అమాయక పేద ప్రజలకు అమ్మి కోట్లు సంపాదిస్తున్నాడని



అది అందరికీ బహిరంగంగానే తెలుసునని ఆరోపించారు. భూదేవి హిల్స్ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా పాఠశాల స్థలం ఆక్రమించి ఏర్పాటు చేసుకోవడంతో పాటు పలు వీధుల్లో 600 చదరపు గజాల నుండి 800 చదరపు గజాల వరకు సుమారు 10 నిర్మాణాలకు పైగా కబ్జాలకు పాల్పడ్డారని, పాఠశాల చుట్టూ సెట్ బ్యాక్ లేదని, ఎటువంటి ఫైర్ సేఫ్టీ కూడా లేదని పత్రికాముఖంగా పలుపత్రాలు వారు చూపించారు. ఏదైనా నిలదీసి అడిగితే కోర్టు స్టే పత్రాలను చూపుతూ దురుసుగా ప్రవర్తిస్తాడని కాంగ్రెస్ శ్రేణులు ఆరోపించారు. ఇటీవలే ఈ కబ్జాల పర్వంపై నిలదీసి ప్రశ్నిస్తే పలువురు భూకబ్జాదారులతో, రౌడీలతో బెదిరింపులకు గురి చేస్తున్నాడని అటువంటి వారిపై ప్రభుత్వం చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షురాలు హైమావతిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ రషీద్, పిల్లి ఆంజనేయులు, కే నరేందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, పి సంజీవరెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, జి భరత్ గౌడ్, మహిళా నాయకురాళ్లు కౌసల్య, మమత అనిత, రజిత, అనిత రెడ్డి, మీనా, కోటేశ్వరరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంబిపూర్ రాజుని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ యువ నాయకులు కాంతాల సాయిరాంరెడ్డి



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 07, :

దీపావళి పండుగ ప్రాముఖ్యతను గుర్తు చేసుకుంటూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని బిఆర్ఎస్ యువ నాయకులు కాంతాల సాయిరాంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, ప్రతి ఇంటా ఆనందం, ఐశ్వర్యం, శాంతి వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

1,133 మంది పదవ తరగతి విద్యార్థుల ఫీజు చెల్లించిన కేంద్రమంత్రి బండి సంజయ్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 07, :

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ పరీక్ష ఫీజులు తానే చెల్లిస్తానని ఇటీవల చెప్పిన కేంద్రమంత్రి బండి సంజయ్ మాట నిలబెట్టుకున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట జిల్లాలో ఉన్న హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి, మద్దూరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 1,133 మంది విద్యార్థుల పరీక్ష ఫీజు రూ. 1.37,140 విద్యాశాఖ అధికారి ఖాతకు బదిలీ చేశారు. దీనికి సంబంధించిన



వివరాలను కలెక్టర్ హైమావతికి శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, బీజేపీ నాయకులు రాంగోపాల్ రెడ్డి, ఖమ్మం వెంకటేశంతో కలిసి అందజేశారు.



విలక్షణ నటుడు తుత్తి సుబ్రహ్మణ్యం

నేడు ఆమంచి వెంకట సుబ్రహ్మణ్యం వర్ధంతి

కొందరు నటులు తమ నటనతో నవ్విస్తారు. మరికొందరు తమ హావభావాలతో అలరిస్తారు. ఇంకొందరు పలికే ఒక్క మాటతోనే ప్రేక్షకుల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతారు. అలాంటి అరుదైన హాస్య నటుల్లో ఆమంచి వెంకట సుబ్రహ్మణ్యం ఒకరు. తెలుగు సినీ ప్రేక్షకులకు ఏవీఎస్‌గా సుపరిచితుడైన ఆయన 'తుత్తి' అనే ఒక్క పదంతోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. విలక్షణమైన సంభాషణల ఉచ్చారణ, విభిన్నమైన హావభావాలు, సహజమైన నటనతో తెలుగు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారు. రంగస్థల నటుడిగా ప్రారంభమైన ఆయన కళాప్రస్థానం మిమిక్రీ కళాకారుడిగా, పాత్రికేయుడిగా, సినీనటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా విస్తరించింది. 2013 నవంబర్ 8న కన్నుమూసిన ఏవీఎస్ వర్ధంతి సందర్భంగా ఆయన కళాప్రస్థానాన్ని మరోసారి స్మరించుకోవాల్సిన సందర్భమిది. ఏవీఎస్ 1957 జనవరి 2న గుంటూరు జిల్లా తెనాలిలో వీరరాఘవయ్య, శివకామేశ్వరి దంపతులకు జన్మించారు. తెనాలిలోని వీఎస్ఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. కళాశాల రోజుల్లోనే రంగస్థలంపై అడుగుపెట్టి నాటకాల్లో విభిన్న పాత్రలు పోషించారు. రసమయి సంస్థను ఏర్పాటు చేసి నవరస ప్రదర్శనలు నిర్వహించారు. మిమిక్రీ కళాకారుడిగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందారు. లలిత కళా సమాఖ్య ద్వారా కళా కార్యక్రమాలు, ప్రముఖుల సన్మాన సభలు నిర్వహించారు. అనంతరం పాత్రికేయ రంగంలోకి ప్రవేశించి ఉదయం, ఆంధ్రజ్యోతి పత్రికల్లో విలేకరిగా, ఉపసంపాదకుడిగా పనిచేశారు. ఈ క్రమంలో దర్శకుడు బాపు దృష్టిలో పడటంతో సినీరంగ ప్రవేశానికి మార్గం సుగమమైంది. ఎన్టీఆర్ నిర్మించిన 'శ్రీనాథ కవిసార్వభౌముడు' చిత్రంలో నటించినప్పటికీ, ముందుగా విడుదలైన 'మిస్టర్ పెళ్లాం' (1993) చిత్రంతో ఏవీఎస్ ప్రేక్షకులకు పరిచయమయ్యారు. తొలి చిత్రంతోనే ఉత్తమ హాస్య నటుడిగా నంది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ చిత్రంలో ఆయన పలికిన 'తుత్తి' అనే పదం విశేష ఆదరణ పొందింది. 'ఘటోత్కచుడు' చిత్రంలోని 'రంగుపడుద్ది', 'శుభలగ్నం' చిత్రంలోని 'గాలి కనపడుతుందా' వంటి సంభాషణలు కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మాటల ఉచ్చారణ, ముఖ కవళికలు, శరీర భాషతో హాస్యాన్ని పండించడంలో ఏవీఎస్ తనకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్నారు. దాదాపు 19 ఏళ్ల సినీ ప్రస్థానంలో ఏవీఎస్ సుమారు 500 చిత్రాల్లో నటించారు. 'మాయలోడు', 'మేడమ్', 'ఆమె', 'శుభలగ్నం', 'యమలీల', 'వినోదం', 'సమరసింహారెడ్డి', 'ఇంద్ర', 'ధర్మచక్రం', 'గంగోత్రి', 'శివమణి', 'వెంకీ', 'శ్రీరామదాసు', 'జై చిరంజీవ', 'కింగ్', 'బెండు అప్పారావు', 'ఝుమ్మంది నాదం' వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలతో మెప్పించారు. హాస్య పాత్రలతోపాటు సహాయ నటుడిగా, ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనూ రాణించారు. పౌరాణిక చిత్రాల్లో శకుని, నారదుడు వంటి పాత్రలను పోషించారు. 'పవిత్ర' ఆయన చివరి చిత్రంగా గుర్తింపు పొందింది. నటనతోపాటు దర్శకత్వం, నిర్మాణం, రచన రంగాల్లోనూ ఏవీఎస్ ప్రతిభ చాటుకున్నారు. 'అంకుల్', 'ఓరి నీ ప్రేమ బంగారం కానూ' చిత్రాలను నిర్మించారు. 'సూపర్ హీరోస్', 'రూమ్‌మేట్స్', 'కోతిమూక' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. 'మిస్టర్ పెళ్లాం', 'అంకుల్', 'కోతిమూక' చిత్రాలకు వివిధ విభాగాల్లో నంది పురస్కారాలు అందుకున్నారు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికై కళాకారులకు సేవలందించారు. సినీరంగంలో ఎంతటి గుర్తింపు సంపాదించినా ఏవీఎస్ తన జన్మస్థలమైన తెనాలిని మరువలేదు. తెనాలికి కళల రాజధానిగా గుర్తింపు తీసుకురావాలని నిరంతరం తపించారు. అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలను తెనాలిలో నిర్వహించేందుకు కృషి చేశారు. సినీ ప్రముఖులను రప్పించి కళా కార్యక్రమాలు, సన్మాన సభలు నిర్వహించారు. కళాకారులను ప్రోత్సహించడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. భారీ వైద్య శిబిరాల నిర్వహణ ద్వారా వేలాది మందికి ఉచిత వైద్య సేవలు అందించేందుకు కృషి చేశారు. రాజకీయాలపైనా ఆసక్తి చూపిన ఆయన తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేశారు.

నవ్వులు మిగిల్చి.. జ్ఞాపకంగా నిలిచి

1980లో ఆశాకిరణ్మయిని ప్రేమ వివాహం చేసుకున్న ఏవీఎస్ కుటుంబ జీవితంతోపాటు కళారంగంలోనూ తన ప్రస్థానాన్ని కొనసాగించారు. 2008లో కాలేయ సంబంధిత అనారోగ్యంతో బాధపడగా కుమార్తె కాలేయ దానంతో మార్పిడి శస్త్రచికిత్స జరిగింది. అనంతరం కోలుకుని తిరిగి సినిమాల్లో నటించారు. అయితే కాలేయ సమస్యలు మళ్లీ తీవ్రం కావడంతో 2013 నవంబర్ 8న మణికొండలోని తన కుమారుడు ప్రదీప్ నివాసంలో కన్నుమూశారు. రంగస్థల నటుడిగా, మిమిక్రీ కళాకారుడిగా, పాత్రికేయుడిగా, హాస్య నటుడిగా, దర్శక నిర్మాతగా ఎన్నో రంగాల్లో తన ప్రతిభను చాటుకున్న ఏవీఎస్ తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన భౌతికంగా దూరమైనా 'తుత్తి' అంటూ పండించిన నవ్వులు తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ప్రణాళికాబద్ధమైన పట్టణాలే ప్రగతికి పునాదులు!

నేడు ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం



ఆకాశాన్ని తాకే భవనాలు.. విశాలమైన రహదారులు.. అత్యాధునిక నిర్మాణాలు.. ఇవి మాత్రమే పట్టణాభివృద్ధికి కొలమానాలు కావు. ప్రతి పౌరుడికి సురక్షితమైన నివాసం, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన రవాణా, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నప్పుడే నిజమైన పట్టణాభివృద్ధి సాధ్యమవుతుంది. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా నగరాలను తీర్చిదిద్దడంతోపాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటం కూడా అత్యంత అవసరం. ఈ లక్ష్యాలను ప్రపంచానికి గుర్తుచేస్తూ ప్రతి సంవత్సరం నవంబర్ 8న ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవాన్ని నిర్వహిస్తారు. పట్టణాలు, నగరాలను ఆరోగ్యకరమైన, సురక్షితమైన, అర్థికంగా బలమైన నివాస ప్రాంతాలుగా అభివృద్ధి చేయడంలో ప్రణాళికల ప్రాధాన్యాన్ని తెలియజేయడమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం.

పట్టణాలు, నగరాల ప్రస్తుత అవసరాలతోపాటు భవిష్యత్తులో పెరిగే జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించడమే పట్టణ ప్రణాళిక. భూమి వినియోగం, నివాస ప్రాంతాల ఏర్పాటు, రహదారుల నిర్మాణం, ప్రజా రవాణా వ్యవస్థ, తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల, విద్యుత్, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, పార్కులు, పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధి వంటి అనేక అంశాలు ఇందులో భాగంగా ఉంటాయి. పట్టణాలు అస్తవ్యస్తంగా విస్తరించకుండా నియంత్రిత పద్ధతిలో అభివృద్ధి చెందేలా చూడటంలో ప్రణాళికలు కీలక పాత్ర పోషిస్తాయి. సరైన ప్రణాళిక లేకుండా విస్తరించే నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు, నీటి కొరత, కాలుష్యం, మురుగునీటి సమస్యలు, నివాస స్థలాల కొరత వంటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదముంది. ఉపాధి, విద్య, వైద్య సదుపాయాలు, వ్యాపార అవకాశాల కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి. దీంతో నగరాలపై జనాభా ఒత్తిడి అధికమవుతోంది. జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు విస్తరించకపోతే ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా నివాస గృహాల కొరత, ట్రాఫిక్ రద్దీ, తాగునీటి సమస్య, పారిశుద్ధ్య లోపాలు, చెత్త నిర్వహణ వంటి అంశాలు పట్టణ పాలనకు సవాళ్లుగా మారుతున్నాయి. వీటిని అధిగమించేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తులో జనాభా ఎంత పెరుగుతుంది, అందుకు ఎన్ని నివాసాలు అవసరం, రవాణా వ్యవస్థను ఎలా విస్తరించాలి, నీటి వనరులను ఎలా వినియోగించుకోవాలి వంటి అంశాలను ముందుగానే అంచనా వేయాలి. పట్టణాల్లో నివసించే ప్రతి ఒక్కరికీ కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడటం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. రహదారుల నిర్మాణంతోపాటు నాణ్యమైన ప్రజా రవాణా వ్యవస్థ, నిరంతర తాగునీటి సరఫరా, సమర్థవంతమైన మురుగునీటి పారుదల, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, క్రీడా మైదానాలు, ఉద్యానవనాలు వంటి సదుపాయాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. పట్టణాల విస్తరణలో కేవలం వాణిజ్య భవనాలు, నివాస సముదాయాల నిర్మాణంపైనే కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సదుపాయాల కల్పనపైనా దృష్టి సారించాలి. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత కీలకంగా మారింది. చెట్ల నరికివేత, చెరువుల ఆక్రమణ, వాయు కాలుష్యం, నీటి వనరుల కలుషితం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు పట్టణాల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయి. వీటిని నియంత్రించేందుకు పట్టణ ప్రణాళికలో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక స్థానం కల్పించాలి. చెరువులు, కుంటలు, సహజ నీటి ప్రవాహ మార్గాలను సంరక్షించడంతోపాటు ఉద్యానవనాలు, పచ్చని ప్రదేశాలను విస్తరించాలి. వర్షపు నీటిని సంరక్షించడం, భూగర్భ జలాలను పెంపొందించడం, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం వంటి చర్యలను ప్రోత్సహించాలి. ప్రకృతికి అనుకూలమైన అభివృద్ధి విధానాలను అనుసరించినప్పుడే పట్టణాలు భవిష్యత్తు తరాలకు నివాసయోగ్యంగా నిలుస్తాయి. పట్టణాభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందాలి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పట్టణాలను అభివృద్ధి చేయాలి. పేదలకు అందుబాటు ధరల్లో నివాస సదుపాయాలు, ప్రభుత్వ విద్యాసంస్థలు, వైద్య సేవలు, రవాణా సౌకర్యాలు కల్పించడం ద్వారా సామాజిక అసమానతలను తగ్గించవచ్చు. ప్రతి పౌరుడు సురక్షితంగా ప్రయాణించేందుకు అనువైన రహదారులు, కాలిబాటలు, ప్రజా రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా పట్టణంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించేలా ప్రణాళికలు రూపొందించాలి. ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధి ఆర్థిక ప్రగతికి కూడా దోహదపడుతుంది. మెరుగైన రవాణా, విద్యుత్, నీటి సరఫరా, సమాచార వ్యవస్థలు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో పరిశ్రమలు, చూపుతాయి. తద్వారా కొత్త పరిశ్రమలు ఏర్పడి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. వాణిజ్య కేంద్రాలు, పారిశ్రామిక ప్రాంతాలు, నివాస సముదాయాల మధ్య సమన్వయం ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తే ప్రజల ప్రయాణ సమయం, రవాణా వ్యయాలు తగ్గే అవకాశం ఉంటుంది. పట్టణాల ఆర్థికాభివృద్ధితోపాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఇది దోహదం చేస్తుంది. పట్టణ ప్రణాళిక కేవలం ప్రభుత్వాలు, అధికారుల బాధ్యత మాత్రమే కాదు. ప్రజల భాగస్వామ్యం కూడా అంతే అవసరం. పట్టణాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించడం, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో అభిప్రాయాలు తెలియజేయడం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి చర్యల ద్వారా పౌరులు పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావచ్చు. స్థానిక సంస్థలు, పట్టణ ప్రణాళిక నిపుణులు, పర్యావరణ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పౌరులు సమన్వయంతో పనిచేసినప్పుడే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది. పట్టణాల అభివృద్ధి అనేది కేవలం నేటి అవసరాలను తీర్చే ప్రక్రియ కాదు. రాబోయే తరాలకు మెరుగైన జీవన వాతావరణాన్ని అందించే బాధ్యత కూడా. వాతావరణ మార్పులు, జనాభా పెరుగుదల, సహజ వనరుల కొరత వంటి సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం ఉన్న నగరాలను నిర్మించాలి. ఇందుకోసం దీర్ఘకాలిక దృష్టితో ప్రణాళికలు రూపొందించి వాటిని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది.

- మౌలిక సదుపాయాల కల్పనతోనే నగరాల సమగ్రాభివృద్ధి
- పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణాల విస్తరణ అవసరం
- రవాణా, తాగునీరు, పారిశుద్ధ్యం, నివాస వసతులకు ప్రాధాన్యం
- పర్యావరణ పరిరక్షణతోనే సుస్థిర పట్టణాల నిర్మాణం
- ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యం

ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ పట్టణాల భవిష్యత్తుపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. కాంక్రీటు కట్టడాల విస్తరణ మాత్రమే అభివృద్ధి కాదని, ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించడంతోపాటు ప్రకృతిని కాపాడటమే నిజమైన ప్రగతికి నిదర్శనమని గుర్తించాలి. నేటి ప్రణాళికలే రేపటి నగరాల రూపురేఖలను నిర్ణయిస్తాయి. ప్రణాళికాబద్ధమైన పట్టణాల నిర్మాణమే ఆరోగ్యకరమైన సమాజానికి, సుస్థిరమైన భవిష్యత్తుకు బలమైన పునాది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ఎక్స్ కిరణాల ఆవిష్కర్త రాంట్జెన్

నేడు అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం!

ఆధునిక ఆరోగ్య సంరక్షణలో వ్యాధి నిర్ధారణకు అత్యంత కీలకమైన 'అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం' ప్రతి సంవత్సరం నవంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహించబడుతోంది. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఎక్స్-కిరణాలను జర్మన్ భౌతిక శాస్త్రవేత్త విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్ 1895 నవంబర్ 8న కనుగొన్నారు. ఆయన చేసిన ఈ చారిత్రాత్మక ఆవిష్కరణకు గుర్తుగా రేడియోలాజికల్ సొసైటీ ఆఫ్ నార్త్ అమెరికా ఆధ్వర్యంలో నవంబర్ 8వ తేదీని అధికారిక రేడియాలజీ దినోత్సవంగా ప్రకటించారు.

ఎక్స్-రే ఆవిష్కరణ వెనుక ఆసక్తికర కథనం

విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్ (మార్చి 27, 1845 – ఫిబ్రవరి 10, 1923) జర్మనీలోని లెన్నెప్ లో జన్మించారు. జ్యూరిచ్ విశ్వవిద్యాలయం నుంచి పి.హెచ్.డి పట్టా పొందిన ఆయన, వివిధ విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్‌గా సేవలందించారు. 1895 నవంబర్ 8న ఆయన కేథోడ్ రే ట్యూబ్ (శూన్య గాజు నాళం) తో ప్రయోగాలు చేస్తున్న సమయంలో ఒక అద్భుతం గమనించారు. ట్యూబ్ చుట్టూ నల్లని కాగితాన్ని కప్పి ఉంచినప్పటికీ, సమీపంలో ఉన్న బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం వింత మెరుపులతో ప్రకాశించడం ప్రారంభించింది. కాథోడ్ ట్యూబ్ నుంచి వెలువడిన అజ్ఞాత కిరణాలు కాగితం, చెక్క, లోహపు పలకల గుండా కూడా ప్రయాణించగలవని ఆయన నిరూపించారు. మనుషుల కళ్ళకు కనిపించని ఈ కిరణాలను ఆయన 'ఎక్స్-కిరణాలు' అని పేరు పెట్టారు. తన భార్య చేతిని ఫోటోగ్రాఫిక్ ప్లేట్ మీద ఉంచి ఈ కిరణాలను ప్రసారం చేయగా, ఉంగరంతో సహా చేతి ఎముకల పంజరం స్పష్టంగా ముద్రితం కావడంతో వైద్య



రంగంలో సరికొత్త శకం ప్రారంభమైంది. ఎక్స్ కిరణాల ద్వారా మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని భావించిన రాంట్జెన్, తన ఆవిష్కరణకు ఎక్కడా పేటెంట్ హక్కులు తీసుకోలేదు. మానవాళికి తన పరిశోధన ఫలితాలు ఉచితంగా అందాలని, ఈ కిరణాలకు తన పేరు కూడా పెట్టరాదని కోరుకున్నారు. 1901లో ఆయనకు భౌతిక శాస్త్రంలో మొట్టమొదటి నోబెల్ బహుమతి లభించగా, ఆ బహుమతి ద్వారా వచ్చిన పూర్తి ఆర్థిక ప్రతిఫలాన్ని వర్జ్ బర్గ్ విశ్వవిద్యాలయానికే విరాళంగా అందజేశారు. తొలి ప్రపంచ యుద్ధం సమయంలో ఏర్పడిన ద్రవ్యోల్బణం కారణంగా చివరి రోజుల్లో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, ఆయన తన నిస్వార్థ తత్వాన్ని వీడలేదు. వైద్య రంగంలో రోగ నిర్ధారణకు (రేడియోగ్రఫీ), రోగ నిర్మూలనకు (రేడియో థెరపీ) ఈ కిరణాలు మూలస్తంభంగా నిలిచాయి. వైద్య రంగంతో పాటు భద్రతా రంగంలోనూ ఇవి విస్తృతంగా ఉపయోగపడుతున్నాయి. ఆయన చేసిన అమూల్యమైన సేవలకు గౌరవార్థంగా ఆవర్తన పట్టికలోని 111 పరమాణు సంఖ్య గల మూలకానికి 'రాంట్జెనీయం' అని పేరు పెట్టి IUPAC సంస్థ ఘనంగా గౌరవించింది. రేడియాలజీ దినోత్సవ సందర్భంగా మానవాళికి విప్లవాత్మక వైద్య వరాన్ని అందించిన మహనీయుడు విల్హేల్మ్ రాంట్జెన్‌ను ప్రపంచం

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ఉత్కంఠ పోరులో భారత్‌దే పైచేయి!

న్యూజిలాండ్‌పై నాలుగు పరుగుల తేడాతో విజయం



- వర్షం అంతరాయంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఫలితం
- ఐదు వన్డేల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో టీమిండియా
- 134 పరుగులకే కుప్పకూలిన కివీస్ బ్యాటింగ్
- నాలుగు వికెట్లతో చెలరేగిన గుర్నూర్ బ్రార్
- 113 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయినా భారత్‌కు విజయం

వెల్లింగ్టన్, నవంబర్ 7 (చురకలు): న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో భారత్ ఉత్కంఠ విజయాన్ని అందుకుంది. వర్షం అంతరాయం కలిగించిన ఈ పోరులో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం నాలుగు పరుగుల తేడాతో గెలుపొందినట్లు మ్యాచ్ వివరాలు వెల్లడిస్తున్నాయి. తొలుత భారత బౌలర్ల ధాటికి న్యూజిలాండ్ 41 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌటైంది. అనంతరం 135 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ కూడా కివీస్ బౌలర్ల ధాటికి తడబడింది. ఏడు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసిన సమయంలో వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. వర్షం కారణంగా ఆట తిరిగి కొనసాగించే పరిస్థితి లేకపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఫలితాన్ని నిర్ణయించారు. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.



భారత బౌలర్ల విజృంభణ

టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. భారత బౌలర్లు ఆరంభం నుంచే కట్టుదిట్టంగా బంతులు సంధించి న్యూజిలాండ్ బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టారు. అర్ష్‌దీప్ సింగ్ తొలి ఓవర్‌ను పరుగులేమీ ఇవ్వకుండా పూర్తి చేయగా, రెండో ఓవర్‌లో ఆకిబ్ నబీ టిమ్ సీఫర్ట్‌ను పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత విల్ యంగ్ (6)ను కూడా నబీ ఔట్ చేశాడు. హెన్రీ నికోల్స్ (11)ను అన్షుల్ కాంబోజ్ బౌల్డ్ చేయడంతో న్యూజిలాండ్ 19 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

53 పరుగులకే ఐదు వికెట్లు

ఆరంభంలోనే మూడు వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్‌ను ఆదుకునేందుకు డారిల్ మిచెల్ ప్రయత్నించాడు. టామ్ లాథమ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దేందుకు కృషి చేశాడు. అయితే గుర్నూర్ బ్రార్ బౌలింగ్‌లో లాథమ్ (7) ఔటయ్యాడు. అదే ఓవర్‌లో గ్లెన్ ఫిలిప్స్‌ను పరుగులేమీ చేయకుండానే పెవిలియన్‌కు పంపించడంతో కివీస్ 53 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. భారత బౌలర్ల ధాటికి న్యూజిలాండ్ బ్యాటింగ్ క్రమం కుప్పకూలింది.

మిచెల్ ఒంటరి పోరాటం

ఒకవైపు వికెట్లు పడుతున్నా డారిల్ మిచెల్ మాత్రం పట్టుదలతో బ్యాటింగ్ చేశాడు. మిచెల్ శాంట్నర్‌తో కలిసి ఆరో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. మిచెల్ 104 బంతుల్లో 55 పరుగులు చేసి అర్ధశతకంతో జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. శాంట్నర్ 38 బంతుల్లో 31 పరుగులు చేసి సహకరించాడు. అయితే అక్షర్ పటేల్ బౌలింగ్‌లో మిచెల్ ఔటవడంతో న్యూజిలాండ్ మళ్లీ ఒత్తిడిలో పడింది. అనంతరం గుర్నూర్ బ్రార్ శాంట్నర్‌ను పెవిలియన్‌కు పంపించాడు. చివర్లో కైల్ జేమీసన్ (7)ను అక్షర్ పటేల్ బౌల్డ్ చేయగా, నాథన్ స్మిత్ (3)ను గుర్నూర్ బ్రార్ ఔట్ చేశాడు. బ్లెయిర్ టిక్నర్ (2)ను అన్షుల్ కాంబోజ్ బౌల్డ్ చేయడంతో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 41 ఓవర్లలో 134 పరుగుల వద్ద ముగిసింది. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ 10 ఓవర్లలో 30 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఆకిబ్ నబీ, అక్షర్ పటేల్, అన్షుల్ కాంబోజ్ రెండేసి వికెట్లు సాధించారు.

స్వల్ప లక్ష్యానికీ భారత్ తడబాటు

135 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు కూడా వెల్లింగ్టన్ పిచ్‌పై కష్టాలు తప్పలేదు. బౌలర్లకు అనుకూలించిన పరిస్థితుల్లో భారత బ్యాటర్లు పరుగులు సాధించేందుకు ఇబ్బందిపడ్డారు. రోహిత్ శర్మ 23 పరుగులు చేయగా, శ్రేయాస్ అయ్యర్ 30 పరుగులతో రాణించాడు. కేఎల్ రాహుల్ 26 పరుగులతో అజేయంగా నిలిచాడు. న్యూజిలాండ్ బౌలర్లలో కైల్ జేమీసన్, జాకబ్ డఫీ చెరో మూడు వికెట్లు పడగొట్టి భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. దీంతో స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలోనే భారత్ ఏడు వికెట్లు కోల్పోయింది.

వర్షమే ఫలితాన్ని తేల్చింది

భారత్ ఏడు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసిన సమయంలో వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయింది. అప్పటికి డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నిర్ణయించిన లక్ష్యాన్ని భారత్ అధిగమించినట్లు మ్యాచ్ వివరాలు పేర్కొంటున్నాయి. దీంతో నాలుగు పరుగుల తేడాతో టీమిండియాను విజేతగా ప్రకటించినట్లు సమాచారం. కివీస్ బౌలర్లు పోరాడినప్పటికీ వర్షం కారణంగా మ్యాచ్‌ను కొనసాగించే అవకాశం లేకపోయింది. నాలుగు వికెట్లతో న్యూజిలాండ్ బ్యాటింగ్ పతనంలో కీలక పాత్ర పోషించిన గుర్నూర్ బ్రార్‌కు మ్యాచ్ ఉత్తమ ఆటగాడి పురస్కారం దక్కినట్లు సమాచారం. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యాన్ని సాధించింది. మొదటి రెండు మ్యాచ్‌ల్లో విజయాలు అందుకున్న టీమిండియా తదుపరి పోరులోనూ గెలిచి సిరీస్‌పై పట్టు మరింత బిగించాలని భావిస్తోంది.



ఐఓఏ అథ్లెట్ల కమిషన్ చైర్‌పర్సన్‌గా సింధు

ఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్ల కమిషన్ నూతన నాయకత్వం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. స్టార్ షట్లర్ పి.వి.సింధు ఐఓఏ అథ్లెట్ల కమిషన్ చైర్‌పర్సన్‌గా.. భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అగ్రశ్రేణి వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, స్విమ్మర్ సాజన్ ప్రకాశ్ ఐఓఏ సర్వసభ్య సమావేశానికి అథ్లెట్ల కమిషన్ ప్రతినిధులుగా ఎంపికయ్యారు. ఈ నాలుగు పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో అభ్యర్థులంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి సంజయ్ శ్రీవాస్తవ ప్రకటించారు. ఈ నలుగురు క్రీడాకారులు 2026-2030 కాలానికి గాను నాలుగేళ్ల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. డిసెంబరు 5న ఐఓఏ ఎన్నికల అనంతరం ఏర్పాటయ్యే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో సింధు, హర్మన్‌ప్రీత్ సభ్యులుగా చేరతారు. ఐఓఏ సర్వసభ్య సమావేశం ప్రతినిధులుగా ఎన్నికైన చాను, సాజన్.. డిసెంబరు 5న జరిగే ఎన్నికల్లో ఓటు వేసే హక్కు కలిగి ఉంటారు. పది మంది సభ్యులతో కూడిన ఐఓఏ అథ్లెట్ల కమిషన్‌లో సలీమా టెటె (హాకీ), స్వప్నిల్ కుసాలె (షూటింగ్), భవానీ దేవి (ఫెన్సింగ్), తజిందర్‌పాల్ సింగ్ తూర్ (షాట్‌పుట్), బొంబేలా దేవి (ఆర్చరీ), మంజీత్‌సింగ్ (కయాకింగ్-కనోయింగ్) సభ్యులుగా ఉన్నారు.



ధోనీని 'మాహీ అంకుల్' అని పిలుస్తా: నటి అనుష్క సేన్

కెప్టెన్' కూల్ ఎంఎస్ ధోనీకి ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. ఆయనను ఒక్కసారైనా నేరుగా చూడాలని ఎంతోమంది ఆశపడుతారు. అలాంటి ధోనీతో తనకు చిన్ననాటి నుంచి ప్రత్యేక అనుబంధం ఉందని నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ అనుష్క సేన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆయనను తాను ప్రేమగా 'మాహీ అంకుల్' అని పిలుస్తానని.. ధోనీ తనను చిక్కీ అని అంటారని తెలిపారు. గతంలో ధోనీతో కలిసి పలు వాణిజ్య ప్రకటనల్లో నటించడం వల్ల తమ మధ్య మంచి అనుబంధం ఏర్పడిందన్నారు. పదేళ్ల క్రితం మొదటిసారి ధోనీని కలిసినప్పటి విషయాలను ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తామిద్దరం రాంచీ నుంచే వచ్చామన్నారు. ధోనీతో కలిసి తాను ఏడేళ్లపాటు 21 ప్రకటనల్లో నటించానని తెలిపారు. ఇప్పటికీ ఎక్కడైనా కలిస్తే.. ఆయన ఎంతో ప్రేమగా దగ్గరకు తీసుకుంటారన్నారు. 'యహా మై ఘర్ ఘర్ ఖేలీ' సీరియల్‌తో అనుష్క సేన్ ఏడేళ్లకే తన నటనా ప్రయాణాన్ని ప్రారంభించారు. అనేక వాణిజ్య ప్రకటనల్లో నటించారు. 'బాల్ వీర్'లో మెహర్ పాత్ర ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. దేవోంకే దేవ్ మహాదేవ్, ఝాన్సీ కీ రాణి వంటి వాటిల్లో నటించారు.

ధినిధికి మరో కాంస్యం



డకార్ (సెనెగల్): యూత్ ఒలింపిక్ గేమ్స్‌లో భారత యువ స్విమ్మర్ ధినిధి దేశింగు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఒకే ఎడిషన్‌లో రెండు వ్యక్తిగత పతకాలు నెగ్గిన భారత తొలి అథ్లెట్‌గా రికార్డుకెక్కింది. మహిళల 100 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచిన ఈ 16 ఏండ్ల కర్ణాటక అమ్మాయి 200 మీటర్ల పోటీలనూ కాంస్య పతకాన్ని ముద్దాడింది. శుక్రవారం జరిగిన తుదిరేసును ధినిధి 2 నిమిషాల 02.28 సెకండ్లతో మూడో స్థానంతో ముగించింది.

టెస్టులకు రివర్స్ స్వింగ్ కింగ్ గుడ్‌బై!

- 13 ఏళ్ల సుదీర్ఘప్రస్థానానికి మహమ్మద్ షమీ ముగింపు
- అరంగేట్రం చేసిన రోజునే వీడ్కోలు నిర్ణయం
- 64 టెస్టులు.. 229 వికెట్లు.. ఆరుసార్లు ఐదు వికెట్ల ఘనత
- తొలి టెస్టులోనే తొమ్మిది వికెట్లతో సంచలనం
- వన్డేలు, టీ20లు, ఐపీఎల్, దేశవాళీ క్రికెట్‌లో కొనసాగనున్న పేసర్



కోల్‌కతా, నవంబర్ 7 (చురకలు): భారత క్రికెట్‌లో తన పదునైన బంతులతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న స్టార్ పేసర్ మహమ్మద్ షమీ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికినట్లు ప్రకటించాడు. పదమూడేళ్ల సుదీర్ఘ టెస్టు ప్రయాణానికి ముగింపు పలుకుతూ సామాజిక మాధ్యమాల ద్వారా తన నిర్ణయాన్ని వెల్లడించినట్లు సమాచారం. 2013 నవంబర్ 7న వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా టెస్టుల్లో అరంగేట్రం చేసిన షమీ, సరిగ్గా పదమూడేళ్ల తర్వాత అదే తేదీన ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. టెస్టులకు వీడ్కోలు పలికినప్పటికీ వన్డేలు, టీ20లు, ఐపీఎల్‌తోపాటు దేశవాళీ క్రికెట్‌లో కొనసాగనున్నట్లు తెలిపాడు. 2013 నవంబర్‌లో కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ మైదానంలో వెస్టిండీస్‌తో జరిగిన టెస్టుతో షమీ అంతర్జాతీయ టెస్టు ప్రస్థానం ప్రారంభమైంది. తొలి మ్యాచ్‌లోనే తన బౌలింగ్ ప్రతిభను చాటుకున్నాడు. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి తొమ్మిది వికెట్లు పడగొట్టి క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. పదునైన పేస్ బౌలింగ్, కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్, బంతిని రెండు వైపులా స్వింగ్ చేయగల సామర్థ్యంతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బందులకు గురిచేశాడు. ముఖ్యంగా పాత బంతితో రివర్స్ స్వింగ్ రాబట్టడంలో షమీ ప్రత్యేక నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. భారత్ తరఫున 64 టెస్టులు ఆడిన షమీ మొత్తం 229 వికెట్లు పడగొట్టాడు. ఆరుసార్లు ఒక ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు సాధించాడు. 27.71 బౌలింగ్ సగటు, 50.2 స్ట్రైక్ రేట్‌తో తన టెస్టు ప్రస్థానాన్ని కొనసాగించాడు. స్వదేశంలో మరింత ప్రభావవంతమైన బౌలర్‌గా నిలిచిన షమీ 22.1 సగటుతో వికెట్లు సాధించాడు. భారత గడ్డపై ప్రతి 42.6 బంతులకు ఒక వికెట్ పడగొట్టిన ఘనత అతడి సొంతం. భారత్ తరఫున అత్యధిక టెస్టు వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో తొలి 15 స్థానాల్లో చోటు సంపాదించాడు. స్వదేశంలోనే కాకుండా విదేశీ పర్యటనల్లోనూ షమీ తన బౌలింగ్‌తో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా పర్యటనల్లో ప్రత్యర్థి బ్యాటర్లకు సవాల్ విసిరాడు. వేగంతోపాటు రివర్స్ స్వింగ్‌ను సమర్థంగా వినియోగించి కీలక సమయాల్లో వికెట్లు సాధించాడు. 2016లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లోనూ తన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. భారత పేస్ దళంలో కీలక సభ్యుడిగా ఎన్నో విజయాల్లో భాగస్వామి అయ్యాడు. 2023లో ఆస్ట్రేలియాతో జరిగిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ షమీ చివరి టెస్టు మ్యాచ్‌గా నిలిచింది. ఆ తర్వాత గాయాలు, ఫిట్‌నెస్ సమస్యల కారణంగా టెస్టు జట్టుకు దూరమయ్యాడు. తిరిగి జట్టులోకి రావడానికి ప్రయత్నించినప్పటికీ టెస్టు క్రికెట్‌లో మరో అవకాశం దక్కలేదు. చివరకు సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడైంది. టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు సందర్భంగా తన ప్రయాణంలో సహకరించిన కోచ్‌లు, శిక్షకులు, ఫిజియోలు, సహచర ఆటగాళ్లకు షమీ కృతజ్ఞతలు తెలిపినట్లు సమాచారం. ముఖ్యంగా తనపై ప్రేమాభిమానాలు చూపిన క్రికెట్ అభిమానులకు ధన్యవాదాలు తెలియజేశాడు. ఎన్నో గాయాలు, ఒడిదుడుకులు ఎదురైనా భారత జట్టు కోసం మైదానంలో పోరాడిన అనుభవాలను గుర్తుచేసుకున్నాడు. టెస్టు క్రికెట్ నుంచి తప్పుకున్నప్పటికీ షమీ ఇతర ఫార్మాట్లలో కొనసాగనున్నాడు. వన్డేలు, టీ20లతోపాటు ఐపీఎల్, బెంగాల్ తరఫున దేశవాళీ క్రికెట్‌లో ఆడనున్నట్లు తెలిపాడు. తన అనుభవాన్ని వినియోగించుకుని పరిమిత ఓవర్ల క్రికెట్‌లో రాణించాలనే లక్ష్యంతో ఉన్నట్లు సమాచారం. భారత టెస్టు క్రికెట్‌లో పేస్ బౌలింగ్‌కు కొత్త పదును తీసుకొచ్చిన ఆటగాళ్లలో షమీ ఒకడిగా గుర్తింపు పొందాడు. ముఖ్యంగా పాత బంతితో రివర్స్ స్వింగ్ రాబట్టి ప్రత్యర్థి బ్యాటర్లను బోల్తా కొట్టించే అతడి నైపుణ్యం అభిమానులకు గుర్తుండిపోతుంది. పదమూడేళ్ల టెస్టు ప్రయాణంలో 229 వికెట్లతో తనదైన ముద్ర వేసిన షమీ నిర్ణయం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



వచ్చిందమ్మా.. మదరాసి రబ్బరు బొమ్మ

సాయి శ్రీనివాస్, నేహా శెట్టి

'టైసన్ నాయుడు'గా ప్రేక్షకుల్ని పలకరించనున్నారు హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని సాగర్ కె.చంద్ర తెరకెక్కించారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. నేహా శెట్టి కథానాయిక. ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "మదరాసి రబ్బరు బొమ్మ.." అంటూ సాగిన ఈ మాస్ పాటకి భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చగా.. సురేశ్ గంగుల సాహిత్యమందించారు. నల్గొండ గద్దర్ నర్సన్న, రోహిణి సోరట్ సంయుక్తంగా ఆలపించారు. క్రీడా నేపథ్య అంశాలతో ముడిపడిన ఈ యాక్షన్ డ్రామాలో బెల్లంకొండ శ్రీనివాస్ శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనున్నారు.



ఇన్‌స్టాగ్రామ్ హ్యాక్..

వ్యక్తిగత కంటెంట్ లీక్‌పై సురేఖా వాణి ఆగ్రహం

టాలీవుడ్ నటి సురేఖా వాణి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై ఆమె తీవ్రంగా స్పందించారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా హ్యాక్ అయిందని తెలిపారు. తన వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారని ఆమె వెల్లడించారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో నోట్ పెట్టారు. మీమ్ పేజీలు, మీడియా సంస్థలు, యూట్యూబ్ ఛానళ్లు, వ్యక్తులు ఎవరైనా సరే.. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆ కంటెంట్‌ను షేర్ చేయడం, రీపోస్ట్ చేయడం తక్షణమే ఆపాలని నటి విజ్ఞప్తి చేశారు. "ఈ కంటెంట్‌ను షేర్ చేస్తున్న ఖాతాలు, వ్యక్తులను గుర్తించి, ఆధారాలను సేకరిస్తాను. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను" అని హెచ్చరించారు. వ్యూస్, రీచ్, పబ్లిసిటీ కోసం.. ఈ పరిస్థితిని ఎవరూ తమకు అనుకూలంగా మార్చుకోవద్దని కోరారు. తన వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని, ఇది చాలా తీవ్రమైన అంశమని ఆమె పేర్కొన్నారు. 2005లో ఇండస్ట్రీకి వచ్చిన సురేఖా వాణి.. ఆ తర్వాత వరుసగా హిట్ సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. 'భద్ర', 'బొమ్మరిల్లు', 'ఏమాయ చేశావే', 'నాయక్', 'బాద్ షా' వంటి సినిమాలతో మెప్పించారు.



సంక్రాంతికి సందడి

భాషతో సంబంధం లేకుండా కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని అలరించే ప్రయత్నం చేస్తున్నారు కథానాయిక మాళవిక మోహనన్. ఇటీవలే 'సర్దార్ 2' చిత్రంలో నటించారు. ప్రస్తుతం విలక్షణ నటుడు విజయ్ సేతుపతితో కలిసి 'పాకెట్ నోవెల్'తో తెరపై సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు మాళవిక. ఇటీవలే ఈ సినిమాని డిసెంబరులో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలొచ్చాయి. తాజాగా ఈ చిత్ర విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. ఈ నేపథ్యంలోనే "పేజీలు తిరుగుతున్నాయి.. తేదీ ఖరారైంది. 'పాకెట్ నోవెల్' ఈ సంక్రాంతికి రాబోతోంది!' అనే క్యాప్షన్‌తో ఒక కొత్త పోస్టర్‌ని సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది. ఈ పోస్టర్‌లో విజయ్ సేతుపతి, మాళవిక, రాజ్ బి.శెట్టి తదితరులు.. వాళ్ల మధ్యలో ఒక డబ్బుల బ్యాగ్ కనిపించిన తీరు సినీప్రియుల్ని ఆకట్టుకుంది. త్యాగరాజన్ కుమార రాజా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాని టైలర్ డర్డెన్, కినో ఫిస్ట్ నిర్మాణ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఇందులో రాజ్ బి.శెట్టి ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.





రూ.6 కోట్ల కోసం హనీట్రాప్?

6 కోట్లు ఇవ్వకపోవడంతోనే దాడి?

టాలీవుడ్ హీరోయిన్ దొంగతనం కేసులో ట్విస్ట్

కొచ్చి, నవంబర్ 6 (చురకలు) : కొచ్చిలో ఒక యువ వైద్యుడిపై జరిగిన భౌతిక దాడి ఘటన కేరళ రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ దారుణ ఘటన వెనుక టాలీవుడ్లో మత్తు వదలరా సినిమాలో నటించిన నటి వేసిన కిలాడీ స్కెచ్ ఉన్నట్లు పోలీసుల విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగుచూశాయి. నటి అతుల్య చంద్ర ప్రధాన సూత్రధారిగా, నటుడు బిపిన్ పెరుంపల్లితో కలిసి ఏకంగా రూ. 6 కోట్లు దండుకునేందుకు ప్రయత్నించడం, ఆ తర్వాత బ్లాక్ మెయిల్‌కు పాల్పడటం ఇప్పుడు సర్వత్రా హాట్ టాపిక్‌గా మారింది. అతుల్య చంద్ర బంధువుల అమ్మాయితో సదరు డాక్టర్‌కు సన్నిహిత సంబంధాలు, స్నేహం ఉంది. ఆ పరిచయాన్నే ఆసరాగా చేసుకున్న నటి అతుల్య, నటుడు బిపిన్ పెరుంపల్లి కలిసి డాక్టర్ వద్ద నుంచి భారీగా డబ్బు గుంజాలని ప్లాన్ వేశారు. ఇద్దరి మధ్య ఉన్న ఒక వివాదాన్ని పరిష్కరిస్తామని నమ్మబలికి ఫ్లాట్ కి రప్పించుకుని అనంతరం, డాక్టర్‌ను ఏకంగా రూ. 6 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే, అంత భారీ మొత్తం తన వద్ద లేదని, తానివ్వలేనని డాక్టర్ తేల్చి చెప్పడంతో ఈ ముఠా తమ అసలు స్వరూపాన్ని బయటపెట్టింది. డాక్టర్‌కు సంబంధించిన అత్యంత వ్యక్తిగత వీడియో ఫుటేజ్, ప్రైవేట్ వాట్సాప్ చాట్స్‌ను సోషల్ మీడియాలో లీక్ చేస్తామంటూ తీవ్ర స్థాయిలో బెదిరింపులకు దిగింది. వారి బ్లాక్ మెయిల్‌కు కూడా ఆ డాక్టర్ లొంగకపోవడంతో, పక్కా ప్లాన్ ప్రకారం అతనిపై అత్యంత దారుణంగా దాడికి పాల్పడ్డారు. ఈ మొత్తం వ్యవహారం చూస్తుంటే, పక్కా పథకం ప్రకారం డాక్టర్‌ను 'హనీట్రాప్' చేశారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసుకు సంబంధించి త్వరలోనే అతుల్య బంధువు వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేయనున్నారు. ఇక ఈ కేసులో పాల్గొన్న నిందితులకు పక్కా క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నటుడు బిపిన్ పెరుంపల్లి డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తిపై గతంలోనే ఎన్‌డీపీఎస్ (డ్రగ్స్) కేసులతో సహా దాడులకు పాల్పడిన సుమారు 8 క్రిమినల్ కేసులు నమోదై ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం పరారీలో ఉన్న మరో నిందితుడైన జిమ్ ట్రైనర్ వద్ద డాక్టర్‌కు సంబంధించిన మొబైల్ ఫోన్లు (వ్యక్తిగత డేటా ఉన్న ఫోన్లు) ఉన్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, ఈ సెలబ్రిటీల ముఠా వెనుక ఉన్న చీకటి కోణాలను వెలికితీసే పనిలో ఉన్నారు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com